


నవతెలంగాణ
9వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
హనుమకొండ జిల్లా

# పాలనలో పరుగు...



**నవతెలంగాణ-సుబేదారి**

హనుమకొండ జిల్లాలో పాలన పరుగులు పెడుతుంది. జిల్లా పాలనలో కలెక్టర్ ప్రావీణ్య తనదైన ముద్ర వేస్తున్నారు. జిల్లాలోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాలనాధి కారి ప్రావీణ్యాన్ని కనబరుస్తున్నారు. అందుకు తన సుదీర్ఘ అ నుభవం తోడుకాగా జిల్లాపై మంచి పట్టు ఉండడంతో పాల నా పరమైన ఇబ్బందులు తలెత్తడం లేదు. ఇందుకు ఆమె అధి కారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను అభివద్ధి పథం లో నడపిస్తున్నార నడంలో ఎలాంటి సందేహం లేదు. జిల్లా పాలనలో కలెక్టర్ తనదైన ముద్ర సమస్యల పరిష్కారంలో 'ప్రావీణ్యం' సుదీర్ఘ అనుభవం.

**జిల్లాపై పట్టు ...తనదైన ముద్ర ...**

హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పాలనలో తనదైన ముద్రను వేస్తూ పట్టు సంపాదిం చుకున్నారు. పేదలకు ప్రభుత్వం నుంచి అందే వైద్య సేవల విషయంలో ఆసుపత్రులను సందర్శించి వైద్యాధికారులకు సూచనలు చేస్తూ రోగులకు ఇబ్బం దులు లేకుండా చూసి జిల్లాలోని పేద ప్రజల మన్ననలు పొందుతున్నారు. నిరుపేద విద్యార్థు లకు పాఠశాల విద్య సక్రమంగా అందాలనే తలంపుతో తరచుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠ శాలలను, అంగన్ వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయుల్లోని బాధ్యతను గుర్తు చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్మించే కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులు, నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం పనులు యుద్ధప్రాతికంగా పూర్తి చేసేందుకు. గుత్తేదారులను, అధికారులను ఆదేశిస్తున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా జిల్లాలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి వాటి పరిష్కారానికి కషి చేస్తు న్నారు. ఇలా జిల్లాలోని అన్నిరంగాలను ప్రగతి ప థంలో నిలిపేందుకు శక్తివంచన లేకుండా ఆహర్నిశలు పాటుపడుతున్నారు.

**సమస్యల పరిష్కారంలో ప్రావీణ్యం ...**

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా నలుమూల నుంచి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా



పరిశీలించి తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లా లోని రైతులు ధరణీ సమస్యలతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్న స్థితిని అర్థం చేసుకుని పరిష్కరిం చదగిన ఫైళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధి కారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**రైతు పక్షపాతిగా ....**

గతంలో పనిచేసిన కలెక్టర్‌లు పెండింగ్‌లో ఉం చిన ధరణిలో వచ్చిన రైతు దరఖాస్తు లను కూడా పరిష్క రించారు. ఇలా ఎప్పటికప్పు డు జిల్లాలోని ప్రజల సమస్యలను సకాలంలో రూపుమాపుతూ అంతర్ జిల్లాల కలెక్టర్ లకు రోల్ మాడల్ గా నిలుస్తున్నారు జిల్లా పాలనా ధికారి ప్రావిణ్య.

**జిల్లాపై పట్టు .....**

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వరంగల్, హను మకొండ జిల్లాల్లో పనిచేసిన అనుభవం ఉంది. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా నియామకం కాకముందు ఆమె వరంగల్ కలె క్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ జిల్లాకు కలెక్టర్‌గా కొన

సాగిన కాలంలో అసెంబ్లీ, పార్ల మెంట్ ఎన్నికలను సమర్థ వం తంగా నిర్వహించా రు. వరంగల్ కలెక్టర్‌గా వచ్చే ముందు ఆమె గ్రేటర్ వరంగల్ మున్సిప ల్ కమిషనర్‌గా పని చేశా రు. ఇలా కొన్నేళ్లుగా జిల్లాలో పాలన పరమైన పట్టు ఉండడంతో అన్ని అం శాలను కూలంకశంగా పరిశీ లించేందుకు వీలు పడుతుం దని చెప్పవచ్చు. ప్రజాపాలన, రైతు రుణమాఫీ, గ్రీవెన్ సెల్ తనిఖీ చేస్తూ వివరాలు అడిగి తెలుసు కున్నారు.

# గ్రామ స్వరాజ్యానికి చుక్కాని 'ముల్కనూర్'



నవతెలంగాణ-భీమదేవరపల్లి

- రైతు అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్న

## ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ

పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు అనే నానుడికి ఊతమిస్తూ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి అండ్ మార్కెటింగ్ సొసైటీ ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఇందులో భాగంగా రైతులు బాగుంటేనే గ్రామ స్వరాజ్యం వెల్లివిరుస్తుందని వారి సంక్షేమానికి కృషిచేస్తుంది. 1956 సంవత్సరంలో రూ. 100లతో స్థాపించిన సొసైటీ నేడు రూ.394.4 కోట్ల లావాదేవీలు జరుపుకుంటుంది. సొసైటీ వ్యవస్థాపకులు అలిగిరెడ్డి కాశీ విశ్వనాథరెడ్డి స్ఫూర్తియే సొసైటీ ఎదుగుదలకు కారణం. సొసైటీ అభివద్ధికి విశ్వనాథ రెడ్డి కషి ఫలితంగా నేడు అనేక ఫలాలను అందిస్తోంది. పూర్తిగా మెట్ట ప్రాంతంలో స్థాపించిన సొసైటీ అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షతన ప్రస్తుతం 132 మంది ఉద్యోగులతో 14 గ్రామాల్లోని 7641 మంది సభ్యులకు విశిష్ట సేవలందిస్తోంది. రైతుసేవల్లో పలువురి ప్రశంసలు పొందుతూ దేశానికి గర్వ కారణంగా నిలుస్తోంది. రైతుసేవల్లో భాగంగా పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కరెంటు మోటార్లు అందిస్తుంది. అంతేకాకుండా వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ మెలకువలను అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల సహకారంతో తెలుపుతూ రైతులకు అండగా ఉంటుంది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సొసైటీ ఉపాధ్యక్షులుగా కొనసాగారు. పీవీ మృతిచెందే సమయం వరకు సొసైటీ సభ్యులుగా కొనసాగడం గొప్ప విషయం.

**సొసైటీ విస్తృత సేవలు ....**

రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాలు అందించడంతో పాటు పంట చేతికి వచ్చిన సందర్భాల్లో దళారుల చేతికి వెళ్లకుండా సొసైటీ కొనుగోలు చేస్తుంది. మార్కెట్ ధరతో పాటు బోనస్ చెల్లిస్తుంది. సొసైటీ పరిధిలోని రైతులేకాకుండా ఇతర ప్రాంతాలైన ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల రైతులు సొసైటీ నుండి తయారు చేస్తున్న నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సేవలు పొందుతున్నారు.

రైతులకు గేదెలు, ఆవులు, గొర్రెల కొనుగోలుకు రుణ సహాయం అందిస్తూ వాటికి బీమా సౌకర్యం కల్పిస్తుంది. కరెంటు మోటార్లు, పైపులైన్లకు రుణ సహాయం అందిస్తుంది. సొసైటీ సభ్యుల పిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

**విద్య, వైద్య, బీమా సౌకర్యాలు ...**

సభ్యుల శ్రేయస్సుకు సొసైటీ విద్య, వైద్య బీమా సౌకర్యాలు కల్పిస్తోంది. అనుభవజ్ఞులైన డాక్టర్లచే పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. సభ్యులకు కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేరితే వారి ఖర్చులు చెల్లిస్తోంది. సొసైటీ సూపర్ బజార్ ఆవరణలో నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. డాక్టర్ శరత్ బాబు ఆధ్వర్యంలో 3194 మంది సభ్యులకు కంటి పరీక్షలతోపాటు ఆపరేషన్లు చేయించారు. ఇందుకుగాను సొసైటీ రూ.1కోటి 88 లక్షల 38వేలు ఖర్చు పెట్టింది.

సభ్యుల పిల్లలు దూర ప్రాంతా ల్లోకి వెళ్లి చదువుల్లో ఇబ్బంది పడకుండా ఇంటర్, డిగ్రీ కళా శాలలు ఏర్పాటుచేసి నాణ్యమైన విద్యను అందించింది. 2008 నుండి 2023 విద్యా సంవత్సరం వరకు 1218 మంది విద్యార్థులకు రూ. 1,01,43,500ల ఉపకార వేతనాలు అందించింది. ఉత్తమ మార్కులు సాధించిన వి ద్యార్థులకు పారితోషికాలు పంపిణీ చేసి ప్రోత్సహించడంలో ముందుంది. సభ్యుల సంరక్షణకు ఎల్ఐసి, నేషనల్ ఇ న్సూరెన్స్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ఇఫ్కో ఇతర సంస్థలచే బీమా సౌకర్యాలు కల్పిస్తోంది.

**భూగర్భ జలాలు పెంచేలా...**

రైతుల బావుల్లో భూగర్భ జలాలు పెంచేందుకు నాబార్డు సహాయంతో వంగర, ముస్తఫాపూర్, ముల్కనూర్, నరహరితండా గ్రామాల శివారులో వాటర్‌షెడ్లను సొసైటీ ఏర్పాటు చేసింది. వాటర్‌షెడ్ల ఏర్పాట్లలో ఆదర్శంగా నిలుస్తోంది.

**ప్రముఖుల సందర్శన...**

సొసైటీ పనితీరు అభివృద్ధి తెలుసుకోవడానికి దేశ విదేశాల ప్రతినిధులు వస్తూ పోతుంటారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం ఎన్‌టీ రామారావు, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, అప్పటి గవర్నర్ నరసింహన్, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పీకర్‌గా ఉన్న సమయంలో సొసైటీని సందర్శించి రైతులకు అందిస్తున్న సేవల పట్ల తెలుసుకొని కొనియాడారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత కాశీ విశ్వనాథరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన కాంస్య విగ్రహాన్ని అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ ఆవిష్కరించారు. సొసైటీ 50 వసంతాల ఉత్సవాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఉమా భారతి కూడా సొసైటీ అందిస్తున్న సేవలను అభినందించారు.

ప్రతి సంవత్స రం తెలుగు రాష్ట్రాల మంత్రులు వివిధ రాష్ట్రాల దేశాల మంత్రులు ప్రముఖులు శాస్త్రవేత్తలు సొసైటీని సందర్శిస్తున్నారు.







**సమిష్టి కృషితోనే అభివృద్ధి : అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు**



సభ్యుల సమిష్టి కృషి క్రమశిక్షణ అంకితభావం, నమ్మకంతోనే సొసైటీఅభివృద్ధి చెందుతుంది. సభ్యుల సంక్షేమం కోసం ప్రతీయేటా నూతన ప్రణాళిక లతో సంక్షేమంలో లోటురాకుండా చూస్తూ ముందుకు వెళ్తున్నాం.

# కబ్జాకోరల్లో చెరువులు



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వరంగల్లో గత కొన్నిసంవత్సరాలుగా చెరువులన్నీ కూడా 90 శాతం కబ్జాకు గురవుతున్నాయి. వీటిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ముఖ్యంగా భద్రకాళి చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువు, పెద్ద వడ్డేపల్లి చెరువు, బెస్తం చెరువు, బంధంచెరువు, వరంగల్‌లో అతిపెద్ద చెరువు అయిన భద్రకాళి చెరువు కబ్జాకు గురి అవుతున్నాయి. భద్రకాళి చెరువు గురించి అప్పుడున్న మున్సిపల్ కమిషనర్‌కు పర్యావరణ పరిరక్షకుడు సామాజిక కార్యకర్త కొలిపాక ప్రకాష్ పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు మాత్రం చేపట్టలేదు. పద్మాక్షమ్మ గుట్ట నుండి డి కన్వెన్షన్ వరకు కట్ట ఉంది. కట్టకి లోపల చాలా కట్టడాలు ఉన్నాయి. వీటిని మున్సిపల్ అధికారులు గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కట్టను గండి కొట్టి చెరువులోకి మురుగునీరును మళ్లిస్తున్నారు. అని దీనిపై గతంలో ఫిర్యాదు చేస్తే గండిని పూడ్చివేశారు. కానీ ఒక నెల తర్వాత మళ్లీ ఆ కట్టను గండి కొట్టారు.

బంధం చెరువు అయితే ఎక్కువగా ఆక్రమణకు గురైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, కబ్జా చేసిన వారిలో కొంత మందికి మాత్రమే నోటీసులు ఇచ్చారని, కానీ ఇంకా చాలామందికి నోటీసులు ఇవ్వా ల్సి ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే హైదరాబాద్‌లో హైడ్రా ఏర్పాటు చేసినట్లు వరంగల్‌లో వాడ్రాను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పా టు చేయాలని, చెరువులన్నింటినీ ప్లాస్టిక్ ఫ్రీ జోన్లుగా ప్రకటించి, మట్టి విగ్రహాలను మాత్రమే చెరువులలో నిమజ్జనం చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**వాడ్రా ఏర్పాటు చేసి చెరువులను పరిరక్షించాలి : ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్**

చెరువుల పరిరక్షించేం దుకు హైదరా బాద్ వలే వరంగల్‌లో కూడా వాడ్రాను ఏర్పాటు చేసి చెరువు లను పరిరక్షించాలి. బంధం చెరువు గుర్రపు డెక్క ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. బంధం చెరువు ఆక్ర మణకు గురికా కుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.



ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి చెరువులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

# కాంగ్రెస్‌లో కోల్డ్ వార్

## వర్గాలుగా విడిపోయిన మండల నాయకులు

నవతెలంగాణ-ఐనవోలు



గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత మండల కాంగ్రెస్‌లో లీడర్లలో కోల్డ్‌వార్ మొదలైంది. ప్రస్తుతంఐనవోలు మండలంలోని కాంగ్రెస్ లీడర్లలో కోల్డ్‌వార్ నడుస్తుందని మండల ప్రజలకు గుసగుసలాడుతున్నారు. దానికి గల కారణాలు లేకపోలేదు. గత పదేళ్లుగా పార్టీని పట్టుకుని ఉన్న లీడర్లను పక్కనపెట్టి పార్టీలోకి చేరిన వారికి పెద్దపీట వేస్తున్నారని అందుకనే ఎవరికి వారే యమునా తీరుగా మండల పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అసలు ఉన్నారా లేరా అనే సందేహం లేకపోలేదు. ఈ పరిస్థితులను గమనిస్తున్న ప్రజానీకం ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోవు గ్రామపంచాయతీ ఎన్నికల్లో గందరగోళం నెలకొనే పరిస్థితులు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరిగే పరిస్థితులు ఉన్నాయని చర్చించుకుంటున్నారు. మండలంలోని ప్రతి గ్రామ పార్టీ అధ్యక్షులు నుండి మండల స్థాయి నాయకులు వరకు ఏ అధికారిక సమావేశానికి హాజరు కావడం లేదు. వారి వ్యక్తిగత పనులలో నిమగ్నమై ఉన్నారు. కారణం లీడర్లకు, కార్యకర్తలకు నాయకుల నుండి సమావేశపు షెడ్యూల్ కనీసం తెలియని పరిస్థితిలో ఉందని వాపోతున్నారు.

ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలలో తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఈ తీవ్రమైన పరిణామం కొన్ని సందర్భాల్లో వివాదాలకు, గొడవలకు దారి తీసే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల స్థాయి లీడర్లు, కార్యకర్తలు మూడు, నాలుగు వర్గాలుగా విడిపోవడంతో మండల నాయకులకు, కార్యకర్తలకు కోల్డ్‌వార్ జరుగుతుందని ప్రజలు తీవ్ర స్థాయిలో చర్చించుకుంటున్నారు. కొసమెరుపు ఏమిటంటే వర్ధన్నపేట ఎమ్మెల్యే ఇద్దరు, ముగ్గురు లీడర్లుతోనే సమావేశాలకు హాజరవుతున్నారని, ఆ సమావేశపు సమాచారం కూడా స్థానిక లీడర్లకు, నాయకులు, కార్యకర్తలకు అందడం లేదని, గతంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులను, లీడర్లను, కార్యకర్తలను గుర్తించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

# వేయిస్తంభాల కళ్యాణ మండపానికి పూర్వ వైభవం





నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వేయిస్తంభాల ఆలయంలో కళ్యాణ మండపానికి శిల్పులు తుది మెరుగులు దిద్దారు. తమిళనాడుకు చెందిన స్థపతి (వాస్తుశిల్పి) శివకుమార్ ఆధ్వర్యంలో 30మంది శిల్పులు నెల రోజులుగా రాత్రింబవళ్లుపనిచేశారు. స్తంభాలను తొలగించడానికి 2005లో రూ.3.50కోట్లతో పనులు ప్రారంభించారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వశాఖ బిల్లుల చెల్లిల పులో జాప్యం చేయగా పనులు మధ్య లోనే నిలిచాయి. 15 ఏళ్ల తర్వాత 2021 నవంబర్లో పనులు పునః ప్రారంభించారు. నిధుల కొరత కారణంగా నత్తనడకన కొనసాగినట్లు సమాచారం. పునరుద్ధరణకు మొత్తం రూ.15కోట్లు వెచ్చించి ఎట్టకేలకు పనులు పూర్తిచేశారు.

**19 ఏళ్ల తర్వాత పనులు పూర్తి**

**రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం కాకతీయుల సాండ్ బాక్స్ టెక్నాలజీ వినియోగం ....**

వేయిస్తంభాల గుడి కల్యాణ మండ పాన్ని పునః ప్రారంభించేందుకు. కేంద్ర పురావస్తుశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కేంద్ర పురావస్తుశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రారంభించారు.కాకతీయ సామ్రాజ్య కళావైభవానికి ప్రతీకగా 132 రాతిస్తంభాలు ఉండేవి. 1163లో రుద్రదేవుడు 850 ఏళ్ల క్రితం నిర్మించాడు. కాలక్రమంలో కల్యాణ మండపం బలహీన పడడంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) దాన్ని తొలగించింది. వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దానికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరింది. దాని కింది నుంచి ప్రవహించిన నీటిపాయ ఇందుకు కారణమని గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో ఇసుక తొలగిపోయి రాతిస్తంభాలు కృంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగిపోయింది. కాకతీయుల కాలం నాటి వేయిస్తంభాల గుడి కల్యాణమండపం పూర్వవైభవం సంతరించుకున్నది.

నీటి ప్రవాహంతో పునాదిలో ఇసుక కొట్టుకుపోయి స్తంభాలు కృంగిపోయి మండపం కూలే ప్రమాదం ఏర్పడ డంతో కేంద్ర పురావస్తుశాఖ 2005లో దీని పునర్నిర్మాణా నికి శ్రీకారం చుట్టింది. అనేక అడ్డంకులు, నిధుల కొరత, తదితర కారణాలతో జాప్యం జరుగగా ఎట్టకేలకు 19 ఏళ్ల తర్వాత పూర్తయింది. ఇందుకోసం మొత్తం రూ.15కోట్లు వెచ్చించగా సాండ్‌బాక్స్ టెక్నాలజీని వినియోగించి తొలగించిన రాళ్లను పేర్చేందుకు శిల్పులు రేయింబవళ్లు శ్రమించగా త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది.

**సరికొత్తగా వేయిస్తంభాల కల్యాణ మండపం ...**


మండపం కూలే ప్రమాదం ఉందని గుర్తించిన కేంద్ర పురావస్తు శాఖ 2005లో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. నిధుల కొరతతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు.

**సాండ్ బాక్స్ టెక్నాలజీతో....**

కళ్యాణ మండపం పునర్నిర్మాణంలో కాకతీయుల ఆత్యంత సంక్లిష్టమైన సాండ్ బాక్స్ టెక్నాలజీనే అనుసరించారు. అంటే ఇసుకనే పునాదిగా చేసుకొని నిర్మాణం చేపట్టారు. కేంద్ర పురావస్తుశాఖ నిబంధనల ప్రకారం ఎక్కడా సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడలేదు. ఇసుకపై ఉన్న కట్టడాన్ని తిరిగి నిలబెట్టారు. కళ్యాణ మండపం అడుగున 3మీటర్లలోతు మట్టి తొలగించి రాగడిమట్టి నింపి గ్రానైట్, ఇటుక, కరక్కాయలు, బెల్లం మిశ్రమంతో క్యూరింగ్ చేశారు. ఈ ఇసుక బేస్‌మెంట్ పైనే రాళ్లను పేర్చారు.

భూకంపాలు వచ్చినా కట్టడం చెక్కుచెదరకుండా రాళ్లకు డాళ్లను పట్టి ఉండేలా స్టెయిన్‌లెస్ స్టీల్ పట్టీలు అమర్చారు. 3వేల శిలలు, గ్రానైట్ కళాఖండాలు, రాతి స్తంభాలు పాత కట్టడాన్ని తొలగించినప్పుడు వెలికితీసి క్రమ పద్ధతిలో నంబర్లు వేసి భద్రపరిచారు. కొన్ని స్తంభాలు పగిలిపోగా శిల్పులతో మళ్లీ చెక్కించారు.

# హామీలకే పరిమితమైన ఇనుప రాతిగుట్టల అభివృద్ధి, ఎకో టూరిజం


**● అసెంబ్లీ సమావేశాల్లో చర్చకురాని ఇనుపరాతిగుట్టల అభివృద్ధి**

నవతెలంగాణ-ధర్మసాగర్

నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గుట్టలను ఎకో టూరిజం, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఎలాంటి పనులు జరగక పోవడమే కాకుండా ఆ ప్రాంతం రైతులు మా భూములను వేరే వారికి ఎలా పట్టా చేశారని ఇది ఎలా సాధ్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. హామీలకే పరిమితమైన ఇనుపరాతి గుట్టల అభివృద్ధి ఆ లోచనలతో మండలంలో వేడెక్కుతున్న భూముల ధరలకు లెక్కలేస్తున్నాయని స్థానిక భూముల యజమానులు ఉవ్విర్లు ఊరుతున్నారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక అటవీ ప్రాంతం ఇనుప రాతిగుట్టలు. పేరొందిన ఈ ప్రాంతంలో చుట్టుపక్కల గ్రామస్తులు కొలిచే దేవుళ్ల గుడులు, ఏడాదంతా నిరంతరంగా పారే జలపాతాలు, పశుపక్ష్యాదుల ఆవాసాలు ఉన్నాయి. కానీ అవన్నీఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానిక రైతులు, ప్రజలు, అధికారులు అయోమయానికి గురవుతున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రపోజల్ ఉన్నప్పటికీ అటవీ శాఖ ఆఫీసర్లు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కొందరు అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నా సందర్భాలు ఉన్నాయని, ఇంకొందరు అటవీ భూములకు ఎసరుపెట్టి ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కానీ ఎప్పటినుండో ఈ ప్రాంతంపై మైనింగ్ మాఫియా కన్నువేసిందని స్థానికులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. అయినప్పటికీ అధికారులు మైనింగ్‌కే మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో సమీప గ్రామస్తులు అయోమయానికి గురవుతూనే వామపక్షాల ఆధ్వర్యంలో ఉద్యమానికి రెడీ అవుతున్నారని తెలుస్తుంది.

హన్మకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో ఇనుపరాతి గుట్టలు విస్తరించి ఉన్నాయి. ఈ నాలుగు మండలాల్లో 4,886.17 ఎకరాల మేర ఈ గుట్టలు వ్యాపించి ఉండగా నిజాంకాలంలోనే దీన్ని అటవీభూమిగా గుర్తించారు. వివిధరకాల జంతుజాతులు, ఔషధ మొక్కలకు ఈ గుట్టలు పెట్టిందిపేరు. జిల్లాలో ఉన్న ఏకైక అటవీ ప్రాంతం ఇదే కాగా ఇక్కడున్న అటవీ ప్రాంతం ఆఫీసర్ల లెక్కల ప్రకారం జిల్లాలో ఒకశాతం మాత్రమే. క్షేత్రస్థాయిలో ఉన్నది మాత్రం అంతకంటే తక్కువే. దీంతో ఈ ఏరియాను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి, అటవీ సంరక్షణకు చర్యలు చేపట్టాలనే ప్రతిపాదనలు ఎప్పటినుండో ఉన్నాయి. అయినా ఆ దిశగా చర్యలుతీసుకునేవారు కరువవడంతో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇటీవల 30 ఎకరాల భూమిని ఆక్రమించుకునే ప్రయత్నాలు జరగగా చివరి నిమిషంలో ఆఫీసర్లు అడ్డుకుని అక్కడ ప్లాంటేషన్ చేపట్టారు. ఇనుపరాతి గుట్టల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని గుట్టలకు సమీపంలోని దేవునూరు, దామెర, కొత్తపల్లి, ఎర్రబెల్లి, నరహరితండా, ముత్తారం తదితర గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవునూరు (ఇనుపరాతి) గుట్టలలో రోప్‌వే, ట్రెక్కింగ్ క్యాంపింగ్, అలాగే హన్మ కొండ హంటర్ రోడ్డులోని జూపార్క్‌ను, ధర్మసాగర్ బండ్ సుందరీకరణ చేయాలని, రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్ ఏ ర్పాటు చేసి అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. గుట్టపై విలువైన నిక్షేపాలు ఉండటంతో కొందరు నేతలకన్ను దీనిపై పడిందని ఇలా గతంలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతో కొందరు వ్యక్తులు అక్రమంగా ఆఫీసర్ల అండతో పట్టా చేయించుకున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొందరు అక్రమంగా మట్టి, విలువైన రాయిని తీసుకెళ్లిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

గతంలో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామస్తులందరికీ సమాచారం ఇవ్వాల్సి ఉండగా కొంతమందికే తెలియజేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నామమాత్రం గా అభిప్రాయాలు సేకరించి ఆల్యాండ్‌ను మైనింగ్ కోసం అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని రైతులు మేధావులు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**విశేషాలన్నీ ఇక మాయమే....**

ఇప్పటికే ఇనుప రాతి గుట్టపై దామెర గ్రామం సమీపంలో మైనింగ్‌కు అధికారులు అనుమతులు ఇచ్చేశారు. అదిమాత్రమే కాకుండా ఎక్కడికక్కడ మైనింగ్ కార్యకలాపాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో గుట్టమీద ఉండే ఎన్నో విశేషాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ గుట్టల్లో బలపాలొద్ది, తీగలొద్ది, జాలులాల అనే మూడు వాటర్ ఫాల్స్‌ఉన్నాయి. ఇవి ఏడాదంతా నిరంతరంగా పారుతూనే ఉంటాయి. ఈ నీటితో చుట్టుపక్కల ఉన్న దాదాపు 400 ఎకరాలు సాగవుతుంటాయి. అంతేగాకుండా దేవునూరు గ్రామ సమీపంలోని జాలు పక్కనే దాదాపు ఆరేడుఎకరాల్లో బటర్‌ఫ్లైజోన్ కూడా ఉండి, అక్కడ రోజూ వివిధ రకాల సీతాకోకచిలుకలు సందడి చే స్తుంటాయని చెప్తూ ఉంటారు. గుట్ట మీద మునుల విగ్రహాల వద్ద ఏటా కార్తీక పౌర్ణమి రోజుల చుట్టుపక్కల ప్రజలు జాలుమల్లన్న జాతర కూడా నిర్వహిస్తుంటారు. వెనకటి కాలంలో ఇక్కడి ఒకప్రాంతంలో ఏనుగులు ఆవాసం ఏర్పాటు చేసుకున్న ఏనుగులమడుగు, నక్సల్స్ ప్రభావిత సమయంలో నిర్మిం చిన అమరవీరుల స్థూపం ఇలా ఎన్నోవిశేషాలు ఈ గుట్టపై ఉన్నాయని దీంతో ఇక్కడికి చుట్టుపక్కల ప్రజలు ఆహ్లాదం కో సం వచ్చి వెళ్తుంటారు స్థానికులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.

ఇన్ని ప్రత్యేకతలున్న ఈ గుట్టలను టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టర్‌గా ఆమ్రపాలి ఉన్న సమయంలోనే చెప్పారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థానిక ఎంపీ కడియం కావ్యతో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు మేధావులు రాజకీయవిశ్లేషకులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరుతున్నారు.

# 'పశ్చిమ'లో 1,200 'డబుల్స్' పంపిణీకి రంగం సిద్ధం

## నాటి పేదలకు న్యాయం జరిగేనా..?

## నేటికీ ప్రారంభం కాని 225 ఇండ్ల నిర్మాణం

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బాలసముద్రం అంబేద్కర్ నగర్, న్యూశాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూంలను పంపిణీ చేయడానికి అధికార యంత్రాంగం రంగంసిద్ధం చేస్తుంది. 'పశ్చిమ' నియోజకవర్గంలో 1,200డబుల్ బెడ్రూంఇండ్ల నిర్మాణానికి రూ.69.60 కోట్లను నాటి రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ మేరకు డబుల్స్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసినా గత కొన్నేండ్లుగా వీటిని లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయలేదు. దీంతో సిపిఐ (ఎం) హన్మకొండ జిల్లా నేతృత్వంలో గత కొన్ని రోజులుగా బాలసముద్రం అంబేద్కర్‌నగర్‌లో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించి డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేసిన విషయం విదితమే. బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్ నగర్‌లలో గతంలో సీపీఐ(ఎం) నాయకత్వంలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని 24ఏండ్లపాటు అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుడిసెలు వేసుకున్న నిరుపేదలకే డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని హామినిచ్చి వారిని అక్కడి నుండి బయటకు తరలించి అదేస్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. నాడు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న నిరుపేదలకు ఇప్పుడు ఈ డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేస్తారా ? లేదా ? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పేదలను ఖాళీ చేయించి పదేండ్లు కాగా, డబుల్ బెడ్రూం ఇండ్ల పనులు పూర్తయి రెండు, మూడేండ్లు పూర్తయినా వాటిని పంపిణీ చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 1,505 డబుల్ బెడ్రూంఇండ్లను నాటి ప్రభుత్వం కేటాయించింది. మొత్తం ఈ డబుల్ బెడ్రూంఇండ్ల నిర్మాణానికి రూ.81.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. ఇప్పటి వరకు రూ.71.44 కోట్లను ఖర్చు చేశారు. 1,200 డబుల్ బెడ్రూం ఇండ్లకు టెండర్లు ఖరారు చేశారు. ఈ మేరకు 1,200 ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగింది. 2014లో 30- 40 గజాల్లోఉన్న నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని నాడు కలెక్టర్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌లు, 12 మంది ఆర్‌ఐలు, పోలీసు అధికారులంతా కలిసి ప్రతి గుడిసె ముం దు లబ్ధిదారులను నిల్చోపెట్టి ఫోటోలు తీసి 594 మంది జాబితాను రూపొందించారు. ఈ జాబితాలోని వారందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలని సిపిఐ (ఎం) హన్మకొండ జిల్లా శాఖ డిమాండ్ చేస్తుంది.

## ప్రజల సమస్యలపై స్పందించి రాసేది "నవ తెలంగాణ"



సమాజంలో పత్రికల పాత్ర చాలా క్రియాశీలకమైనది . మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల స్థితిగతులు సమాజంలో అరాచకాలు అసమానతలపైన నిర్భయంగా "నవ తెలంగాణ" వార్తలు రాస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అప్పటికప్పుడు మేమున్నామంటూ ప్రజలకు భరోసా ఇచ్చే విధంగా పత్రిక ఉండాలని కోరుతున్నాం .నవతెలంగాణ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు

**- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే**

## శ్రామిక వర్గాన్ని చైతన్యవంతం చేసే పత్రిక నవ తెలంగాణ



'నవతెలంగాణ' దినపత్రిక ప్రధానంగా సమాజంలోని కార్మికులు, రైతులు, యువకులు,అట్టడుగు వర్గాలు, మహిళల గొంతుకగా పనిచేస్తూ పాలకవర్గాల విధానాల మూలంగా ఉత్పన్నం అవుతున్న సమస్యలను ప్రమాదాలను పసిగట్టి శ్రామిక ప్రజానీకానికి అందించి, చైతన్య పరుస్తున్నది. కార్పోరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయంగా ప్రజల అనుకూల విధానాలను వార్తల రూపంలో ప్రచారం చేస్తున్నది నవ తెలంగాణ దినపత్రిక. రాబోయే రోజుల్లో మరింత పదునుగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాం. నవ తెలంగాణ పత్రికకు 9 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

**- పీ.ప్రావీణ్య, జిల్లా కలెక్టర్ హనుమకొండ**



## నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

రాష్ట్రంలో అనేక పత్రికలు పని చేస్తున్నాయి. వాటి వ్యాపారం రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి. వాటిలో నవ తెలంగాణ పత్రిక మాత్రం కేవలం ప్రజల ప్రయోజనాల కోసం ముఖ్యంగా ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలిపేలా వార్తలు రాస్తూ ఉంది. నవ తెలంగాణ మరింత అభివద్ధి చెందాలి. నవ తెలంగాణ పత్రికలో పని చేసే విలేకరులు, సిబ్బంది, పత్రిక యాజమాన్యానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు

**- శ్రీకాంత్‌రెడ్డి**

# విష జ్వరాల నివారణకు పకడ్బందీ చర్యలు

**డెంగ్యూ జ్వరాలపై ప్రత్యేక దృష్టి**

**'నవతెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో డీపీఓ లక్ష్మిరమాకాంత్**

నవతెలంగాణ-సుబేదారి

జిల్లాలో డెంగ్యూ జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి ఇంటింటికి పంచాయతీ సిబ్బంది వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా కాలనీల్లో బ్లీచింగ్‌పౌడర్, దోమల నివారణ మందు పిచికారి చేస్తూ, నిల్వ ఉన్న నీటి గుంటలు, డ్రమ్ముల్లోని నీటిని పారబోసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అంటురోగాలపై అవగాహన కల్పిస్తున్నాం. జీపీ కార్మికులు ప్రతి రోజూ ఇండ్లలోని చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులో వేస్తున్నారు. దీంతో విష జ్వరాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్ 'నవతెలంగాణ' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

**నవతెలంగాణ :** జిల్లాలో ఎన్ని పంచాయతీ లు,ఎన్ని ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి.

**డీపీఓ :** జిల్లాలో మొత్తం 208 పంచాయతీలు ఉన్నాయి.128ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నాం. ఆయా పంచాయతీల్లో ప్రతి రోజూ జ్వరాలపై గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోగాలబారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**నవతెలంగాణ :** డెంగ్యూ వ్యాధి పై జిల్లా ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటీ ?

**డీపీఓ :** డెంగ్యూ వ్యాధికారక దోమలు మంచినీరు, అవాసాల దగ్గరే ఉంటాయి. ఆ దోమలు వాడి పడేసిన టైర్లు, కూలర్లు, పగిలిన కుండలు, కుండీలు తదితర వస్తువుల్లో జీవిస్తాయి. నిల్వ ఉన్న వర్షం నీటిని పార బోసి శుభ్రంగా ఉంచుకోవాలి.

**నవతెలంగాణ :** పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉంటున్నారా ?

**డీపీఓ :** అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటడంతో ప్రతి రోజూ తనిఖీలు చేస్తూనే ఉన్నాం. తనిఖీల్లో అక్కడక్కడ చిన్నచిన్న తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని హెచ్చరిస్తున్నాం.

# మేధోశక్తి, విలువలకు నిలువుటద్దం 'పింగిలి కళాశాల'






నవతెలంగాణ-నయీంనగర్

తెలంగాణ రాష్ట్రంలోనే పింగిలి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల అద్భుతమైన చరిత్రను కలిగి ఉంది. ఈ కళాశాల హన్మకొండలోని వడ్డేపల్లిలో 1965లో ఆర్ట్స్, కామర్స్, సైన్స్ కోర్సులతో 67మంది విద్యార్థులు, 11మంది సిబ్బందితో ప్రారంభమైంది. ఈ కళాశాల భవనాన్ని పింగిలి కుటుంబానికి చెందిన వారు తరగతుల నిర్వహణ కోసం విరాళంగా అందించారు. దీంతో మారుతున్న పరిస్థితులకనుగుణంగా నిరంతర సుస్థిరమైన అభివృద్ధి సాధించింది.

1966-67లో, కళాశాల బీఏలో డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టింది. (హెచ్‌పీపీ) బీఏ, (ఈపీపీ) బీఎస్సీలో బీజెడ్‌సీ, ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల్లో సంస్థ కాకతీయ విశ్వవిద్యాలయం అధికార పరిధిలోకి వచ్చింది. ఈ కళాశాల 2016లో స్వర్ణోత్సవాలను జరుపుకుంది.

1985లో బీకాం, బీఎస్సీలో సాంప్రదాయ కోర్సులు(ఎంపీసీ) 1994లో బీఎస్సీ, (బీజెడ్‌సీ) 1995లో బీఎస్సీ వంటి కోర్సులను పునర్నిర్మించారు. మైక్రోబయాలజీ బి.కామ్ (కంప్యూటర్స్) ప్రవేశ పెట్టబడ్డాయి. అందువల్ల కళాశాల సామాజిక-ఆర్థికంగా బలహీనమైన మహిళా విద్యార్థుల వైవిధ్యమైన అవసరాలు, డిమాండ్లను తీర్చడం ద్వారా అసాధారణంగా అభివద్ధి చెందింది. కళాశాల 2017లో ఎన్ఏసీసీ 'ఏ' గ్రేడ్‌చే గుర్తింపు పొందింది.2021లో స్వయంప్రతిపత్తి హోదా అందించబడింది. కళాశాలను కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో క్లస్టర్ కళాశాలగా గుర్తించబడింది. ఈ కళాశాల అప్‌గ్రేడ్ కోసం మీడియా సైతం తోడుగా నిలిచింది. నిజమైన భావాన్ని నెరవేర్చడానికి "మేధోశక్తితో విలువలచే నడపబడేది" అనే ట్యాగ్‌లైన్ యొక్క నిజమైన భావాన్ని నెరవేర్చడానికి జీవిత నైపుణ్యాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వాన్ని రూపొందించింది.. విద్యా, సామాజిక సాంస్కృతిక అంశాలు క్రీడలతో సహా బహుముఖ అభివద్ధికి వాతావరణాన్ని అందిస్తాయి.

# విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



**మంచం పట్టిన మురికి వాడలు**

**అనారోగ్యం బారిన పడుతున్న పేదలు**

**అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం**

నవతెలంగాణ-నయీంనగర్

నగరంలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురికివాడల్లో పేదలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంలో వైద్య శాఖ అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత విషయమై అవగాహన లేకపోవడంతో మురికివాడల్లోని ప్రజలు దోమలతో సహజీవనం చేస్తూ అనేక రోగాలపాలవుతున్నారు. తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు కొన్ని ప్రాంతాల్లో పగిలిపోయి మురుగు నీరు మళ్లీ అదే పైపులోకి చేరుతుంది. వెంటనే రిపేర్ చేయాల్సిన అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో మురుగునీటినే ప్రజలు వాడుతున్నారు. నయీంనగర్ ప్రాంతంలో దోమల విజృంభనతో జ్వర పీడితుల సంఖ్య పెరిగి ఆస్పత్రులు రోగులతో నిండి పోతున్నాయి. ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దావఖానాల్లో వైద్యులు పూర్తిస్థాయిలో అందు బాటులో లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నారు. నగర శివారల్లో పలు తండాలు పూరుగుట్ట, మధుతండా, కోమటి పల్లి, పరిమళ కాలనీల్లోని ప్రజలు వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా వైద్య శాఖ అధికా రులు నగరంలోని ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్ లక్ష్యం

## ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపకులు తుమ్మ అమరేష్

నవతెలంగాణ-కమలాపూర్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలిక తీయడమే లక్ష్యంగా ఎస్ఆర్ఎఫ్ పని చేస్తుందని ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపకులు నరేష్ తెలిపారు. మానవత్వం పరిమళించే మహోన్నత వ్యక్తిగా, అందరి ఆదరాభిమానాలు పొందుతూ, అనునిత్యం ఆణిముత్యాలను గుర్తించి వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అందరి ఆదరాభిమానాలు పొందిన సంస్థ ఎస్ఆర్ఎఫ్



భవిష్యత్తులో రాయబోయే పోటీ పరీక్షలకు ముందుస్తు ప్రిపరేషన్‌కు తోడ్పడుతూ, ప్రభుత్వ పోటీ పరీక్షలకు దీటుగా డూప్లికేట్ షీట్ యిచ్చి విద్యార్థుల లోపాలను సరిచేసుకునే అవకాశాన్ని యిస్తూ, వారి కాన్ఫిడెన్స్ లెవెల్ ను పెంచుతూ ప్రభుత్వ, ప్రభుతేతర పాఠశాలలోని ప్రతిభావంతులను వెలికితీస్తున్న ఏకైక సంస్థ- ప్రముఖ ప్రత్యత విశ్వమేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని మాథ్స్ మెటిక్స్ డే పురస్కరించుకొని శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత 19ఏండ్ల నుండి అనేక సేవా కార్యక్రమాలతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఒలంపియాడ్స్ నిర్వహి స్తున్నది. శ్రీనివాస రామానుజన్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్, సివి రామన్ సైన్స్ ఒలంపియాడ్, .అబ్దుల్ కలాం ఒలంపియాడ్, స్టేట్ ఇంగ్లీషు ఒలంపియాడ్, నేషనల్ శ్రీనివాస రామానుజన్ మాథ్స్ ఒలంపియాడ్ స్టేట్ సైబర్ ఒలంపియాడులను నిర్వహిస్తున్నారు. ఈ ఒలంపియాడులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గత 19ఏండ్లుగాఉచితంగా ఒలంపియాడ్లలను నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ఎస్ఆర్ఎఫ్ అని తెలిపారు.

# టూరిజానికి కేరాఫ్ ఓరుగల్లు..



నవతెలంగాణ-నయీంనగర్

వరంగల్ కోట 13వ శతాబ్దంలో నిర్మించబడిన వరంగల్ కోట కాకతీయుల కాలం నాటి వాస్తు శిల్పానికి చక్కటి ఉదాహరణ. వరంగల్ కోటరాజు గణపతిచే నిర్మించబడింది. తర్వాత అతని కుమార్తె రాని రుద్రమదేవి ద్వారా మరింత అభివద్ధి చేయబడింది. కాకతీయ రాజ్యానికి చివరి పాలకుడు అయిన రుద్రదేవ అని పిలవబడే రాజు ప్రతాపరుద్ర చేత ఈ కోటకు తర్వాత చేర్పులు చేయబడ్డాయి. కాకతీయ రాజ్యాన్ని హన్మకొండ నుంచి వరంగల్‌కు తరలించినప్పుడు ఈ కోట నిర్మించబడింది. వరంగల్ కోట మూడు పొరల వత్తాకార కోటను కలిగి ఉంటుంది. ప్రతి ఒక్కటి బలమైన రక్షణను అందిస్తుంది. వివిధ రకాల దాడుల వల్ల వరంగల్ భారీగా నష్టపోయింది కోట శిథిలాలు ఎక్కువగా దాని మధ్య భాగంలో ఉంటాయి పురవస్తు జోనుగా గుర్తింప పొందిన ఈ కోట వరంగల్ నగరం యొక్క అద్భుతమైన గతాన్ని గురించి తెలుసుకోవాలని ప్రతి పర్యాటకుడికి ఒక మంచి ప్రదేశం. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి కాకుండా తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాలు విదేశాల నుంచి వరంగల్కు వచ్చే పర్యాటకులు వరంగల్ కోటను తప్పనిసరిగా సందర్శించి వెళుతుంటారు. కోట అందాలను చూసి మైమరిచిపోతారు. వరంగల్ కోట సందర్శనకు వచ్చిన వారు పక్కనే ఉన్నటువంటి కుష్మహాలను సైతం సందర్శించి వెళుతుంటారు. కుష్మహల్ 14వ శతాబ్దంలో తుజ్ఞత పాలన సమయంలో నిర్మించబడింది

**భద్రకాళి దేవాలయం**

భద్రకాళీ దేవాలయం వరంగల్ హనుమకొండ మధ్యలో ఉంటుంది. భద్రకాళి దేవికి అంకితం చేయబడిన ఈ ఆలయం చాళుక్యుల పాలన నాటిది ఈ ఆలయంలో భద్రకాళి అమ్మవారు ఎనిమిది చేతులతో ఒక్కొక్కటి ఒక్కో ఆయుధంతో ఉంటుంది. ఈ ఆలయాన్ని ప్రతిరోజు వందలాదిమంది భక్తులు తెల్లవారుజాము నుంచే దర్శించుకుంటారు. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో ప్రతిరోజు వేలాది మంది భక్తులు ఈ దేవాలయాన్ని దర్శించుకుంటున్నారు. వరంగల్ నగరం నుండే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతిరోజు భక్తులు తరలివచ్చి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని తమ కోరిన కోరికలను చెప్పుకొని వెళ్తుంటారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు సైతం వేయి స్తంభాల దేవాలయం వరంగల్ కోట చూసినా అనంతరం భద్రకాళి దర్శనం చేసుకొని వెళుతుంటారు.

# మా ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి మహాప్రభో !






### సమగ్ర శిక్ష ఉద్యోగుల వేడుకోలు

**సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల బాధలు తీరేదెన్నడు ?**

**వారి బతుకుల్లో వెలుగు చూసేదెన్నడు ?**

**నెల రోజులుగా వివిధ కార్యక్రమాలతో నిరసనలు వ్యక్తం చేస్తున్న టీఎస్ఎస్ఏ ఉద్యోగులు**

నవతెలంగాణ-వేలేరు

పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హన్మకొండ జిల్లా పర్యటన సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వేడు కుంటున్నారు.

2023సెప్టెంబర్ 13న ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం హన్మకొండ ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వస్తే వందరోజుల్లో సమస్యలను పరిష్కరించి ఉద్యోగాలను క్రమబద్ధీకరి స్తామని హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు కావస్తున్నా తమ సమస్యల పరిష్కారంలో అతిగతీ లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో హన్మకొండ జిల్లా వ్యాప్తంగా 9విభాగాల్లో 413మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. ఇందులో జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో 9మంది, మండల కార్యాలయంలో ఎంఐఎస్‌లు 8మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 8మంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు 40మంది, ఐఇఆర్పిలు 24 మంది, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు 49 మంది, మెసెంజర్లు 8మంది, కేజీబీవీ యుఆర్ఎస్‌లలో టీచింగ్ విభాగంలో 153 మంది, నాన్ టీచింగ్ విభాగంలో 114 మంది, మొత్తం 413 మంది హన్మకొండ జిల్లాలో పని చేస్తున్నారు. వీరంతా గత బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాల క్రమబద్ధీ కరణకు అనేకమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. అయితే 2023 ఆగస్టు నెలలో పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించి, ఆందో ళనలు చేపట్టారు. అనంతరం రిలే నిరాహార దీక్షలు చేపట్టి 42 రోజుల పాటు కొనసాగించారు. ఎన్నికల ముందు 2013 సెప్టెంబర్ 13న ప్రస్తుత ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కె నాగరాజు సమక్షంలో ఏకశిలా పార్కు వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్పుడు టీపీసీసీ అధ్యక్షుని హోదాలో సందర్శించి మాట్లాడి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సమస్యలు పరిష్కరించి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పాలనలో సమగ్ర శిక్ష ఉద్యోగులు వెట్టి చాకిరికి గురై కనీస వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇప్పటి వరకు తమ ఉద్యో గాలు రెగ్యులరైజ్ చేయడంలేదని ఎస్ ఎస్ఏ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. హన్మకొండ జిల్లాకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అప్పుడు ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి లేదా కనీసం మినిమం టైం స్కేల్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నారు. రాజ్యాంగబద్ధంగా అధికరణ 16 ప్రకారం, జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా డిగ్రీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణతతో పాటు కలెక్టర్లు చైర్మన్, డీఈఓ, డైట్ ప్రిన్సిపాల్, ఒక సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ మెంబర్లుగా, జిల్లా ప్రాజెక్ట్ అధికారి కన్వీనర్‌గా ఐదుగురు జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా అన్ని అర్హతలతో నియమించబడ్డామని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పాలకులు ఎన్నికల సమయంలో ఒకలాగా, అధికారంలోకి వచ్చాక ఒకలాగా వ్యవహరిస్తారా? ఇప్పటికైనా స్పందించి, ఎన్నికల హామి ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు వెంటనే మినిమం టైం స్కేల్ అమలు చేయాలనే ఏకైక డిమాండ్‌తో గత నెలరోజులుగా జులై 30 న అసెంబ్లీ ముట్టడి, ఈ నెల 16 న హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డికి అన్ని జిల్లా కేంద్రాల నుండి వినతిపత్రాలు ఇచ్చారు. ఈ నెల 28 న జిల్లాకేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి ఒకరోజు నిరాహారదీక్ష చేసి జిల్లా అధికారులకు వినతి పత్రం ఇవ్వడంతో పాటు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో వినతిపత్రాలు ఇస్తూ శాంతియుత మార్గాలలో వారి గోడును వెళ్లబోస్తూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.**

**మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి : మొగిలిచర్ల శ్రీనివాస్ (టీసీఆర్‌పీఏ అండ్ తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు)**



సీఎం రేవంత్‌రెడ్డి హన్మకొండలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి అప్పుడు మాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగితే తమ సమస్యలు పరిష్కారమవు తాయని రేవంత్‌రెడ్డి స్వయంగా చె ప్పారు. హన్మకొండ జిల్లాకు వస్తున్న సంద ర్భంగా అప్పటి హామీని దృష్టిలో పెట్టుకుని తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి.

**'సమాన పనికి సమాన వేతనం అందజేయాలి' : రాజు (టెక్నికల్ పర్సన్ సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయం హన్మకొండ జిల్లా)**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమగ్ర శిక్షలో పని చేస్తున్న మా ఉద్యోగులందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం తక్షణమే అమలు చేయాలి. ఇచ్చిన మాటకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలి.

**ఉద్యోగ భద్రత కల్పించండి : కె శ్రీనివాస్ హన్మకొండ జిల్లా నాయకులు**

రాజ్యాంగబద్ధంగా అధికరణ 16ప్రకారం ఉద్యో గాలకు కావాల్సిన అర్హ తలతో మేము నియ మించ బడ్డాం. సుప్రీం కోర్టు తెలిపిన ప్రకారం క్రమబద్ధీ కరణకు అర్హులం. తక్షణం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మా ఉద్యోగాలను క్రమ బద్ధికరించాలి.

**మానవత్వం లేని ప్రభుత్వాలు ఉండటం దురదృష్టకరం : తిరందాసు సంతోష్ కుమార్ (టీసీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగంలో చేరిన దగ్గరి నుండి 300లకు పైగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు మరణించారు. ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు ఉద్యోగులు చనిపోయారు. నేటి వరకు వారికి కనీసం పునరల్ చార్జీలు అందించని ప్రభుత్వాలు ఉండడం దురదష్టకరం. విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాలకు కొందరు చనిపోతే చాలీచాలని వేతనాలతో అప్పుల బాధ భరించలేక గుండె నొప్పితో చనిపోయారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 15మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు చనిపోయారు.కానీ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్కరిని ఆదుకోలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. వీరందరికీ ఉద్యోగ భద్రత లేకపోవడమే కారణం.

# ప్రాణ రక్షక దాత 108 వాహనం

నవతెలంగాణ-సుబేదారి

ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తోంది 108 అంబులెన్స్.. దేశవ్యాప్తంగా 24గంటలు అత్యవసర సేవల కోసం ఉచితంగా కాల్ చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ కలిగి ఉంది.ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా చక్కని సేవలు అందిస్తోంది. క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడం ద్వారా ఎందరికో ప్రాణదానం చేసింది.. ఆ వివరాలతో ప్రత్యేక కథనం..

అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ కలవనప్పుడు ఇతర సమస్యలకు వరంగల్ జిల్లా 108 మేనేజర్ 99484 26826 నెంబర్‌కు సంప్రదించవచ్చు.

**ఫోన్ కాల్ చేయగానే పరిగెత్తుకుంటూ...**

ఎవరైనా 108కు కాల్ చేసి ఆపదలో ఉన్నామని తెలియజేస్తే వారికున్న జీపీఎస్ సహాయంతో దగ్గరలోని అంబులెన్స్ సంఘటనాస్థలానికి 18-20 నిమిషాల్లో చేరుకుంటుంది. అత్యవసర పరిస్థితులలో ఉన్న వ్యక్తులకు తక్షణ వైద్య సేవలు అందిస్తోంది. తదుపరి చికిత్స కోసం ఆసుపత్రులకు సకాలంలో చేర వేస్తోంది.. ఇందుకోసం 108 అంబులెన్స్‌లో శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ (ఈఎంటీ), వాహనాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చగల సమర్థుడైన పైలెట్ ఉంటారు.

**నగరంలో ఎక్కడ ప్రమాదం జరిగినా 20 నిమిషాల్లో ఎంజీఎం తరలింపు**

వరంగల్ త్రినగరి పరిధిలో ఉన్న 108 అంబులెన్స్‌లు.. ఎక్కడున్నా 20 నిమిషాల్లో బాధితులను ఎంజీఎం ఆసుపత్రికి చేరుస్తాయి. కూయ్ కుయ్ అని వచ్చే ఈ వాహనాలకు ప్రజలు స్పందించి దారి ఇస్తే త్వరగా అవి గమ్యస్థానాలకు చేరకుంటాయి. దీంతో అందులో ప్రయాణించే వారి ప్రాణాలను రక్షించవచ్చు.

**అంబులెన్స్‌లో సౌకర్యాలు...**

అత్యవసర రోగులు, బాధితులకు చికిత్స అందిస్తూ ఆసుపత్రికి చేర్చడానికి 108 అంబులెన్స్లో అవసరమైన అన్నిరకాల వైద్యపరికరాలు ఉంటాయి. గ్లూకోమీటర్, బీపీ ఆపరేటర్, థర్మ మీటర్, విషం తాగిన వారికి చికిత్స




అందించడానికి సక్సెన్ ఆపరేటర్, గుండెపోటు బాధితులకు షాకింగ్ చికిత్స అందించడానికి కార్డి యాక్ ఏఐడీ యంత్రం, ఆక్సిజన్, స్ట్రెచర్, కాలుచేతులు విరిగి లేవలేనివారికి స్కూప్ స్ట్రెచర్, ప్రమాదంలో వెన్నుపూస విరిగి కదలలేని వారికి స్పైయిన్ బోర్డు తదితర వైద్య పరికరాలు ఉంటాయి. ఆసుపత్రిలో చేర్చేవరకు ఆ పరికరాలను ఉపయోగిస్తూ రోగులకు ఈఎంటీలు ప్రాథమిక చికిత్స అందిస్తారు.

**మట్టిలో పడేసిన శిశువుకు జీవం..**


హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామశి వారులో మే నెల 4న నవజాత శిశువును రోడ్డుపక్కన గుర్తు తెలియని వారు పడేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో హనుమకొండ జీఎంహెచ్ నియోనేటల్ ఈఎంటీ వేణు,108 పైలెట్ మటిన్‌పాషా తక్షణం వెళ్లి శిశువుకు చికిత్స అందిస్తూ ఎంజీఎంలోని నవజాతశిశువు సంరక్షణ కేంద్రంలో చేర్చారు. సకాలంలో ఆసుపత్రిలో చేర్చడంతో మూడు నెలల తర్వాత శిశువు కోలుకొని ప్రస్తుతం జిల్లా శిశు సంరక్షణ కేంద్రంలో ఉంది.

**జీపీఎస్ సాంకేతికతతో సేవలు : పాటి శివకుమార్ (108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్)**




అత్యవసర అంబులెన్స్ సేవలలో జీపీఎస్ సాంకేతికతను వినియోగిస్తున్నాం. అందరికీ ట్యాబ్లు ఇచ్చాం. ప్రతి అంబులెన్స్ ఈఎంటీ ట్యాప్ ఆధారంగా సేవలను అందిస్తారు. ఉదాహరణకు నర్సంపేట నుంచి ఎంజీఎం ఆసుపత్రికి బాధితుడిని తీసుకొచ్చిన 108 అంబులెన్స్ తిరిగి వెళుతున్నప్పుడు ఆ సమయాన్ని ట్యాబ్లో నమోదు చేయాలి. ఆ అంబులెన్స్ వెళ్తున్నప్పుడు దాని పరిసరాల్లో ఏదైనా సంఘటన జరిగితే.. దానికి సమాచారం వెళ్తుంది. అందులో ఆ బాధితులను ఆసుపత్రికి చేరుస్తాం.


ప్రతి ఉదయాన్నే ప్రతి హృదయాన ఉషోదయాన్ని నింపుతూ
అనుదినం-జనస్వరం నినాదంతో
పత్రికారంగంలో నూతన ఒరవడితో ముందుకు సాగుతున్న
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ANNIVERSARY CELEBRATIONS
2015-2024
9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నవతెలంగాణ అభిమాని
హనుమకొండ


నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
PINGLE
Govt. College for Women
WADDEPALLY, HANUMAKONDA
AUTONOMOUS
Accredited by NAAC with "A" Grade
Permanently Affiliated to KAKATIYA UNIVERSITY
Elevate your self and Learn , Lead, Succeed.
it is only through admission in Pingle College
P.G.COURSES
M.A. (English)
M.A. (Telugu)
M.A. (History
M.A. (Public Administration)
M.Com
M.Com (CA)
M.Sc. (Botany
M.Sc. (Zoology)
M.Sc.(Microbiology)
M.Sc.(Computer Science)


నవతెలంగాణ
ప్రతి ఉదయాన్నే ప్రతి హృదయాన ఉషోదయాన్ని నింపుతూ
అనుదినం - జనస్వరం నినాదంతో
పత్రికా రంగంలో నూతన ఒరవడితో ముందుకు సాగుతున్న
నవతెలంగాణ దినపత్రిక 9వ వార్షికోత్సవ సందర్భంగా
యాజమాన్యానికి, పాఠకులకు, ప్రకటనకర్తలకు పాత్రికేయులకు, మిత్రులకు, సిబ్బందికి...
శుభాకాంక్షలు
ANNIVERSARY CELEBRATIONS
2015-2024
నవతెలంగాణ అభిమాని
నరసింహారావు, హన్మకొండ జిల్లా


నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి,
పాఠకులకు, ప్రకటనకర్తలకు, పాత్రికేయులకు,సిబ్బందికి,
9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
SAKETHA
HIGH SCHOOL
ENGLISH MEDIUM
అంబాల - కమలాపూర్,
జి॥ హనుమకొండ


నవతెలంగాణ దినపత్రిక
యాజమాన్యానికి ,
పాత్రికేయులకు,
సిబ్బందికి, మిత్రులకు
9వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ANNIVERSARY CELEBRATIONS
పి. సరస్వతీ
అంగన్వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ అసోసియేషన్
అధ్యక్షురాలు , TNGO's హన్మకొండ జిల్లా


నవతెలంగాణ దినపత్రిక యాజమాన్యానికి , పాఠకులకు,
సిబ్బందికి , పాత్రికేయులకు
9వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
VH
వజ్ర హాస్పిటల్
డా॥ డి. అరుణ్ కుమార్
D.N.B. (Gen.Medicine)
జనరల్ ఫిజిషియన్ & డయాబెటాలజిస్ట్
క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్
బాలసముద్రం, హనుమకొండ, సెల్ : 9633206645



## ప్రైవేట్ పాఠశాలలకు బోధించాలి

**జిల్లా కలెక్టర్ సత్య శారద**

**నవతెలంగాణ-వరంగల్**

ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ పాఠశాల వాతావరణాన్ని కలిగి ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం బి సి., ఎస్సి., వెల్ఫేర్ హాస్టల్స్, కెజీబీవి, ట్రైబల్ వెల్ఫేర్, మైనరీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టళ్ల ప్రిన్సిపల్స్ రిజినల్ కోఆర్డినేటర్స్ తో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారంఅందిం చాలని అన్నారు. బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలపై ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని ఆర్సివో, ప్రిన్సిపల్స్ లను ఆదేశించారు.పిల్లలకు నాణ్యమైన విద్యా తో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించాలని అన్నారు. హాస్టల్స్‌లో కంప్లయింట్ బాక్స్ ఏర్పాటు చేయడం జరిగింది. పిల్లలకి ఎలాంటి అసౌకర్యాలు, ఆహారం అందించుటలో లోపాలు ఉన్నట్లు అయితే కంప్ల యింట్ బాక్స్ లో వివరాలు రాసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కంప్లయింట్ బాక్స్ లు ఉండేలా చూడాలని అన్నారు..ఆ కంప్లయింట్ బాక్స్ తాళం చెవులు నా వద్దనే ఉంటాయి అని వాటిని నేనే తెరిచే అవకాశం ఉందని, పిల్లల పేర్లు,వారు రాసిన స్లిప్స్ గోప్యంగా ఉంచుతానని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా చూడాలని, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలంటే ఇప్పటి నుండే తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. బాలుర, బాలికలు ఆశ్రమ పాఠశాలలో చదువుతో పాటు సమాజంలోని స్థితి గతులను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులు, టీచర్లు స్నేహభావంతో మెలిగే వాతావ రణాన్ని కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిం చడమే లక్ష్యంగా ఉందని, జిల్లా లోని సంక్షేమ హాస్టల్స్‌ను ఏ సమయం లోనైనా, రాత్రి వేళల్లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, అధికారుల్లో అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జోనల్ ఆర్సివో స్వరూప రాణి, ట్రైబల్ వెల్ఫేర్( డిసివో) పర్వత గిరి అపర్ణ, జిల్లా విద్యా శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డిబీసీడిఓ పుష్పలత, డిఎస్సిడిఓ భాగ్యలక్ష్మి, వర్ధన్నపేట సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'దేవాదుల' కేసింగ్ పనులు బొందివాగు పనులపై మంత్రుల అసంతృప్తి, అసహనం

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో భాగంగా ప్యాకేజీ 3లో దేవన్నపేట టన్నెల్ పనులకు సంబంధించి కేసింగ్ పనులు గత రెండు నెలలుగా జాప్యం జరగడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిని, అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్ వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రులు కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారుల వ్యవహారశైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం వరంగల్ నగరంలోని బొందివాగు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.158 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు నెలల క్రితం సమీక్షా సమావేశంలోనే ఆమోదం తెలిపారు. అయినా నేటికీ పనులు చేపట్టకపోవడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను నిలదీశారు. రెండు నెలల క్రితమే ఈ పనులు చేయాలని ఆమోదించాం.. ఎందుకు జాప్యం జరుగుతుంది ? అని అధికారులను ప్రశ్నించారు. పనులు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు. ప్రొటెక్షన్ వాల్ నిర్మాణపు పనులు మాత్రం నేటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం.

**టన్నెల్ పనుల్లో జాప్యం..**

దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో భాగంగా దేవన్నపేటలో జరుగుతున్న టన్నెల్ పనుల్లో కేసింగ్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంజనీరింగ్ అధికారులు కేసింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో 'కడియం' ఎప్పుడు కేసింగ్ పనులు ప్రారంభించారని ప్రశ్నించారు.దీంతో 15రోజుల నుండి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. రెండు నెలల క్రితం జరిగిన సమీక్షా సమావేశంలోనే దేవన్నపేట టన్నెల్ పనులకు కేసింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మీరు చెబుతున్నట్లు రోజుకు 2 మీటర్ల కేసింగ్ పనులు జరిగినా, ఈ రెండు నెలల్లో పనులు పూర్తయ్యేవన్నారు. పనుల విషయంలో సీరియస్‌గా లేకపోతే ఎలా ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిరంతరం సమీక్షిస్తూ ఆదేశాలిస్తున్న పనుల్లో జాప్యం చేయడం తగదన్నారు. మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులను నిలదీయడంతో టన్నెల్‌లో ఫౌండేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. నేటి నుండి పనులు ప్రారంభిస్తామన్నారు.



## అభివృద్ధి పనులు జరగట్లేదని ధర్నా

**నవతెలంగాణ-వరంగల్**

డివిజన్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయంలతో పాటు అభివృద్ధి పనులు అధికారులు చేపట్టనట్లయితే మళ్లీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శుక్రవారం డివిజన్ సమస్యలు పరిష్కారానికి రాజకీయాలకతీతంగా మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ప్రజాధర్నా కార్యక్రమంలో మాట్లాడారు. మేయర్ కమిషనర్ అధికారుల నిర్లక్ష్యం వల్లే డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుట లేదని, వారి వైఖరి మారాలని ఆయన కోరారు. ఏ ఒక్క పని అధికారులు శ్రద్ధ చూపటం లేదని ఎన్నోమార్ల దృష్టికి తీసుకు వచ్చిన ఫలితం కానరావడం లేదన్నారు. డివిజన్‌లో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు వసున్నా కొంతమంది అధికారులు సిద్ధంగా లేరని అన్నారు. బాక్స్ డ్రైన్ నిర్మా ణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు 11/2 సంవత్సరాల నుండి మార్కింగ్ ఇవ్వనందులనే శ్మశానవాటిక మునిగిపోతుందన్నారు. మహానగరపాలక సంస్థలో మట్టి రోడ్లు ఎగుడుదిగుడుగా దర్శనమిస్తున్నాయని, స్మశానవాటికలు అధ్వానంగా ఉన్నాయని, పైప్ లైన్లు, కరెంటు స్తంభాలు లేక చీకట్లో వెళ్లవలసిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మాణం లేక ఇండ్లలోకి నీరు వస్తుందని కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని మేయర్ కమిషనర్ వెంటనే చొరవ చూపాలని నినాదాలు చేశారు. కమిషనర్ అందుబాటులో లేనందున అడిషనల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పూజారి విజయ్, ఆవుల శ్రీకాంత్, కూరపాటి రాజన్ బాబు, ఆవునూరి ఐలేశం, అవునూరి నాగరాజు, శ్రీపాద హరిప్రసాద్, మదూరి సుధాకర్, అన్న శ్రీనివాస్, పసునూరి రాజు, పుష్పలత, వనం కుమార్, మరుపల్ల గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా మురళిని కలిసిన మజీద్ నిర్మాణ కమిటీ సభ్యులు

**నవతెలంగాణ కాశిబుగ్గ**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 13వ డివిజన్‌లో చేపడుతున్న నూతన మజీద్ నిర్మాణ కమిటీ సభ్యులు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్‌రావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన మజీద్ నిర్మాణం పూర్తి అయినదని, కానీ మజీద్ చుట్టు ప్రహరీ నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు కొండ మురళీధర్ రావును కోరారు. దీనిపై వెంటనే స్పందించిన కొండ మురళీధర్ రావు మంత్రి కొండ సురేఖతో మాట్లాడి మజీద్ ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా నూతన మజీద్ కమిటీ సభ్యులు కొండ దంపతులకు, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మొహమ్మద్ అయూబ్ లకు కతజ్ఞతలు తెలియజేశారు.

## స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక అభివృద్ధి

**- ఇండస్ట్రీస్ జీఎం వీఎస్‌రాజు**

**నవతెలంగాణ-కాశిబుగ్గ**



స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ వి ఎస్ రాజు కోరారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ సొసైటీ కాలనీలోని స్వశక్తి భవన్‌లో జరిగిన బ్యూటీషియన్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న 31మంది మహిళలకు ఇండస్ట్రీస్ జీఎం రాజు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి మరో 10మందికి జీవనోపాధి కల్పించాలని కోరారు. అనంతరం ఆగస్టు 15సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు రాజు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారిని మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మా జననీ విమెన్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు వడ్డేపల్లి మాధవి, డైరెక్టర్ సౌమ్య అసిస్టెంట్ డైరెక్టర్ ఆడెపు స్వప్న పాల్గొన్నారు.

వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లో...

# 'మహాలక్ష్మి'తో నెలకు రూ.14.30 కోట్ల ఆదాయం

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేశాక వరంగల్ ఆర్టీసి రీజియన్ లాభాల్లో పురోగమిస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9ఆర్టీసి డిపోలున్నాయి. మహిళలకు 'మహాలక్ష్మీ' పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాక వరంగల్ ఆర్టీసి రీజియన్ నెలకు రూ.14.30కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది. ఈ లక్ష్మీ పథకం అమలు కాకముందు 2023నవంబర్‌లో, పథకం అమ లులోకి వచ్చాక 2024జూలై నెల గణాంకాలను పరిశీలిస్తే బస్సు ట్రిప్పులతో పాటు ఆదాయం, ఓఆర్, ప్రయాణీకుల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది. బస్సు ట్రిప్పులు రోజుకు అదనంగా 56 పెరిగాయి. సగటున వరంగల్ ఆర్టీసి రీజియన్‌లో సగటున రోజుకు 4లక్షల మంది ప్రయాణి స్తుండగా, ఇందులో 2.5లక్షల మంది మహిళా ప్రయాణీకు లుంటుండగా, 1.5 లక్షల మంది పురుషులున్నారు.





**గణనీయంగా పెరిగిన మహిళా ప్రయాణీకులు**

మహాలక్ష్మీ పథకం అమలులో ఆర్టీసి బస్సుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వరంగల్ ఆర్టీసి రీజియన్‌లో నవంబర్ 2023లో మొత్తం ప్రయాణీకుల సంఖ్య 73.72 లక్షల మంది కాగా, మహాలక్ష్మీ పథకం అమలు ప్రారంభమయ్యాక గత జూలై మాసంలో మహాలక్ష్మీ ప్రయాణీకుల సంఖ్యనే 75.33లక్షల మంది వుండడం గమనార్హం. జూలైలో మహా లక్ష్మీ పథకాన్ని వినియో గించని ప్రయాణికులు 43.31 లక్షల మంది వున్నారు. గత నవంబర్, తాజా జూలై మా సపు లెక్కలను పరి శీలిస్తే మహిళా ప్రయా ణీకుల సంఖ్య గణనీ యంగా పెరిగిందనేది స్పష్టంగా గోచరిస్తుంది.

**పెరిగిన ట్రిప్పులు**

మహాలక్ష్మి పథకం అమలు చేశాక గతేడాది నవంబర్‌లో వరంగల్ రీజియన్‌లో 911 బస్సులు 5,084 ట్రిప్పులలో 73.72 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి. ఈ పథకం అమలు చేశాక జూలై మాసంలో 928 బస్సులు 5,140 ట్రిప్పులలో 118.64 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చాయి. మహాలక్ష్మీ పథకంతో రోజుకు ట్రిప్పులు 56అదనంగా పెరగ్గా, ప్రయాణికుల సంఖ్య 44.92 లక్షల మంది అదనంగా ప్రయాణించారు. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గత నవంబర్‌లో 78.94 శాతం వుండగా, మహాలక్ష్మీ పథకం అమలు చేశాక 95.24 శాతానికి పెరిగింది. రీజియన్ మొత్తంలో అదనంగా 16.30 శాతం ఓఆర్ పెరిగింది.

**పెరిగిన ఆదాయం**

మహాలక్ష్మీ పథకం అమలు చేశాక వరంగల్ ఆర్టీసి రీజియన్ జూలై మాసంలో అదనంగా రూ.14.30 కోట్లు అదనంగా వచ్చింది. ఈ పథకం అమలు కాక ముందు 2023 నవంబర్‌లో రూ.52.54 కోట్ల ఆదాయం రాగా, ఈ పథకం అమలు చేశాక ఈ జూలైలో రూ.66.84 కోట్ల ఆదా యం వచ్చింది. మహాలక్ష్మీ పథకం అమలు చేయ డంతో అదనంగా రూ.14.30 కోట్లు పెరిగింది.

# ప్రాజెక్టుల్లో దోచుకున్న కేసీఆర్

**నాశనమైన నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

నీటిపారుదల ప్రాజెక్టులలో ప్రజాసొమ్మును మాజీ సీఎం, ఆయన కుటుంబసభ్యులు దోచుకు న్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఉదయం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ములుగు జిల్లా కన్నాయిగూడెంలోని తుపాకులగూడెం దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌజ్‌ను సందర్శించారు.ఈ సంద ర్భంగా ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కమిషన్లకు కక్కుర్తి పడి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు నీటిపారుదల రంగాన్ని నాశనం చేశారన్నారు. అవగాహన రాహిత్యం, అనాలోచిత నిర్ణయాలతో కాళేశ్వరం కూలడానికి కారకులయ్యారన్నారు. ఇంజనీర్లు ఎప్పుడైన ప్రాజెక్టుల పనుల విషయంలో స్వేచ్ఛగా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చన్నారు. ఇంత మారుమూల ప్రాంతంలో అప్రమత్తంగా పనిచేయడం పట్ల ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భూసేకరణలో తీవ్ర జాప్యం జరుగుతున్నందునా ఎమ్మెల్యేలందరూ రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, 2026 మార్చిలోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో వున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి అంకితభావంతో పని చేస్తుందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ గత పదేండ్లలో కాలువల నిర్మాణాన్ని పట్టించు కోలేదని, దీంతో చాలా వరకు కాలువలు పూడిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయాలని భావించడం వల్లే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా ఇక్కడికి వచ్చి పనులను సమీక్షిస్తున్నారని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**ఏడాదిపొడవునా ఎత్తిపోతలు నడవాలి : శాసనమండలి వైస్‌ఛైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్**

సమ్మక్క బ్యారేజీ నిర్మాణం పూర్తయినందునా గోదావరి జలాలు మరింత అందుబాటులోకి రావడంతో ఇక్కడి నుండి ఏడాది పొడవునా ఎత్తిపోతలు చేపట్టాలి. ఎస్సారెస్పీ రెండో దశ, ఎల్‌ఎండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పనులను లింక్ చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి అధికంగా ప్రయోజనం కలుగుతుంది.

**60టీఎంసీలను వినియోగించుకోవాలి : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

దేవాదుల ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంలో 170 రోజులు 39 టిఎంసిలు లిఫ్ట చేసేలా డిజైన్ చేసినా, సమ్మక్క సాగర్ నిర్మాణం పూర్తి అయినందునా 300రోజుల పాటు ఎత్తిపోతలు చేసేలా జీవో ఇవ్వాలి. ఈ ప్రాజెక్టుకు 60టిఎంసిల గోదావరి జలాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. మూడో దశలో ప్యాకేజీ 3లో దేవన్నపేట వద్ద టన్నెల్‌లో పనులు తీవ్ర జాప్యం జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే భూసేకరణ పూర్తి కావాలి. ఇప్పటికే 3వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో వుంది. ఇందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణ సమస్యను పరిష్కరించాలి. రామప్ప వరకు గోదావరి జలాలు అందుతున్నాయి. రామప్ప నుండి ధర్మసాగర్ ఆపై ఎగువ ప్రాంతాలకు గోదావరి జలాలు వెళ్లాలంటే ధర్మసాగర్ వద్ద నిర్మాణాలను పూర్తి చేస్తేనే సాధ్యమవుతుంది. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుండి నవాబ్‌పేట రిజర్వాయర్ మెయిన్ కాలువ, పాలకుర్తికి వెళ్లే 4ఎల్ కాలువ పనులు జరగలేదు. ఈ పనులు పూర్తయితే 97వేల ఎకరాలకు సాగునీరందుతుంది. శ్రీమన్నారయణపురం వద్ద కాలువల్లో పూడిక పేరుకుపోయి, నీరు దిగువకు ప్రవహించడం లేదు. వెంటనే పూడిక తొలగించాలి. అశ్వరావుపల్లి కుడి మెయిన్ కాలువ నిర్మాణం పూర్తి కాలేదు. ఈ కాలువ గుండాల వరకు వెళ్తుంది. ఈ పనులు పూర్తయితే 48 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. రూ.5-7 కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయని కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. గతంలో తవ్విన కాలువల్లో పూడిక పేరుకు పోయింది. పూడిక, జంగిల్ క్లియరెన్స్ చేయడానికి నిధులు కేటాయించాలి. భూసేకరణ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేలందరం సహకరిస్తాం.

**కోనాయమాకుల లిఫ్టును పూర్తి చేయాలి : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

ఎస్సారెస్పీలో భాగంగా నిర్మించిన కోనాయమాకుల లిఫ్టును వెంటనే పూర్తి చేయాలి. పంప్‌లు వచ్చాయి. రెండు బిల్లులు పెండింగ్‌లో వుండడంతో పనులు మందగించాయి. ఆ బిల్లులను చెల్లిస్తే డిసెంబర్‌లోపు పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి అవకాశముంటుంది. ఇది పూర్తయితే 14వేల ఎకరాలకు సాగునీరందుతుంది. చిన్ననీటిపారుదలకు సంబంధించిన చెరువు పనుల ప్రతిపాదనలను ఇప్పటికే మీకు సమర్పించినందునా వెంటనే నిధులు మంజూరు చేయాలి.

**రూ.40 కోట్లు విడుదల చేస్తే భూసేకరణ పూర్తి : ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి**

రూ.40కోట్లు విడుదల చేస్తే నా నియోజకవర్గంలో భూసేకరణ పూర్తవుతుంది. పనులు పూర్తి చేస్తే 45వేల ఎకరాలకు సాగునీరందుతుంది. 800ఎకరాల భూసేకరణ పూర్తి చేయాల్సి వుంది. రూ.3కోట్ల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. వాటిని చెల్లిస్తే కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన చేసే అవకాశముంది. బిల్లులు పెండింగ్‌లో వుండడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదు. ఇక్కడ పనులు పూర్తయితే పాలకుర్తి, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో 77 వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశముంది.

**రెండు చెరువుల రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

దేవాదుల ప్రాజెక్టు మూడో దశలోని రంగాయ, ఎర్రాయ చెరువులను కలిపి రిజర్వాయర్‌గా చేసే పనులకు సంబంధించి టెండర్‌ను రద్దు చేశారు. దీని కింద కాలువల నిర్మాణం పూర్తి కాలేదు. మళ్లీ టెండర్ పిలిచి పనులు పూర్తి చేస్తే 4 మండలాల్లో 36 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. పాకాల కాలువల మరమ్మతులకు చేయడానికి నిధులు మంజూరు చేయాలి. తూములకు లీకేజీలున్నందునా వెంటనే మరమ్మతులు చేపట్టి, కాలువలలో పూడిక తొలగించాలి. రామప్ప-పాకాల లింకు కాలువల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలి.

**భూసేకరణ పూర్తి చేయాలి : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

దేవాదుల పనులకు సంబంధించి గణపురం మండలంలో భూ సేకరణ పెండింగ్‌లో వుంది. దీంతో గోరికొత్తపల్లి, రేగొండ, చిట్యాల మండలాల్లో కాలువల పనులు పూర్తి కాలేదు. ఈ పనులు పూర్తయితే 44వేల700 ఎకరాలకు సాగునీ రందించవచ్చు.గ్రావిటి కాలువలతో సాగునీరందించే అవకాశమున్నందునా వెంటనే చర్యలు తీసుకోవాలి. గతంలో భారీ వర్షాలకు మోరంచపల్లి లిఫ్టు మొత్తానికి కొట్టుకుపోయింది. వెంటనే లిఫ్టును పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ఎస్సారెస్పీ డిబిఎం 38కు దేవాదుల కాలువను లింకు చేస్తే భూపాలపల్లి నియోజకవర్గ రైతాంగానికి అధిక లాభం జరుగుతుంది.

**కోనారెడ్డి చెరువు నింపాలి : వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు**

దేవాదుల ప్రాజెక్టు నీటితో వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువును నింపాలి. తద్వారా రైతులకు అత్యంత ప్రయోజనం కలుగుతుంది. నా నియోజకవర్గంలో గతంలో తవ్విన కాలువల్లో పూడిక పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు నా దృష్టికి తీసుకురావడంతో రూ.2 లక్షలు నా సొంత డబ్బును వెచ్చించి పూడిక తీయడం జరిగింది. కాలువల పూడికతీతపై ఇప్పటికే రెండుసార్లు ఈఎన్సీని కలవడం జరిగింది. పూడిక తీసి రైతులను ఆదుకోవాలి.

**మున్నేరుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి : మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్**

మున్నేరు చెక్‌డ్యామ్‌పై చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే మహబూబాబాద్ నియోజకవర్గంలో రైతులకు అధిక ప్రయోజనం కలుగుతుంది. ఎస్సారెస్పీ డిబిఎం 40,48 డిస్ట్రిబ్యూటరీల కింద కాలువలకు షట్టర్లు లేవని, కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి పూడిక తొలగించి షట్టర్లను బిగిస్తే సాగునీరు రైతులకు అందుతుంది. రెడ్యాల చెక్‌డ్యామ్ నిర్మాణానికి టెండర్ పిలిచారు. ఎన్నికల కోడ్‌తో ఇప్పటి వరకు పెండింగ్‌లో వుంది. వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, కుడా ఛైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఇఎన్సీ అనిల్‌కుమార్, ములుగు, వరంగల్ సిఈలు విజయభాస్కర్, అశోక్‌కుమార్, ఎస్ఇలు సుధీర్ తదితర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.





## అధికారులు నిబద్ధతతో పని చేయాలి

**బ్యాంకర్లు రైతులకు వంద శాతం రుణాలు ఇవ్వాలి**

**యూరియా కొరతపై ఏఓలు దృష్టి సారించాలి**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)**

విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అధ్యక్షతన అగ్రికల్చర్, బ్యాంకర్లు, వైద్యాధికారులతో పాటు సెక్టార్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా జిల్లాలోని ఆయా బ్యాంక్ మేనేజర్లతో రైతు రుణాలపై కలెక్టర్ వివరణ కోరారు. అందులో ఏటూరునాగారం కెనరా బ్యాంక్, డీసీసీ బ్యాంక్, రైతు రుణాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని కలెక్టర్ దివాకర టీఎస్ మంత్రికి తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలోని కొన్ని బ్యాంకులు కూడా ఇదే బాటలో ఉండడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతురుణ మాఫీ కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ బ్యాంక్ మేనేజర్లు ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రశ్నించారు. మీరు బ్యాంక్‌ల నుంచి సొంతంగా ఇవ్వడం లేదుకదా మరి రైతులను బ్యాంకులో చెట్టు ఎందుకు తిప్పించుకుంటున్నారని అడిగారు. మరోవారం రోజుల్లో రైతు రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి 100శాతం రుణాలు ఇవ్వాలని ఆదేశించారు.

**యూరియా కొరతపై ఏఓలు దృష్టి పెట్టాలి**

ఫర్టిలైజర్ షాపుల్లో యజమానులు యూరియాను బ్లాక్ చేసి కొరత సృష్టిస్తున్నారని, వీటిపై ఏఓలు తనిఖీలు చేసి సమస్యను పరిష్కరించాలని, రైతులకు కొరత లేకుండా చూడాలని మంత్రి సీతక్క అన్నారు. యూరియా నిల్వలు తనిఖీ చేయాలని కోరారు. అంతేకాకుండా రైతుల రుణమాఫీ విషయంలో సలహాలు సూచనలు ఇస్తూ వారికి అండగా ఉండాలన్నారు. బ్యాంక్, రైతులకు సమన్వయంగా ఏఓలు పనిచేయాలన్నారు.

**సీజనల్ వ్యాధులపై వైద్యులు దృష్టి పెట్టాలి**

జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ప్రబులుతున్న విషజ్వరాలు, అంటురోగాలపై వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సీతక్క అన్నారు. వర్షాకాలం తగ్గే వరకు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ జ్వరాలను గుర్తించి మందులు, చికిత్సలు అందించాలన్నారు. దోమలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎంహెచ్ఓ అప్పయ్యతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రూ. 75 లక్షలతో ఏటూరునాగారంకు సెంట్రల్ లైటింగ్**

ఏటూరునాగారం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా ప్రధాన రహదారి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర తో కలిసి పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల చిరకాల కళ నెరవేరిందని, ఎన్నో సంవత్సరాల నుంచి సెంట్రల్ లైటింగ్ సిస్టం కావాలని ప్రజలు అనేక మార్లు కో రారన్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రోడ్డు మధ్యలోని డివైడర్లలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందు కోసం సీఆర్ఎస్ గ్రాంటు నుంచి రూ. 75 లక్షల మంజూరు ఇచ్చామన్నారు. ఫిష్ మార్కెట్ నుంచి వై జంక్షన్ వరకు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు.

**వసతి భవనం ప్రారంభం**

మండల పరిషత్ కార్యాలయంలో మండల అదనపు గదుల వసతి భవనాన్ని రూ. 29.98లక్షలతో నిర్మించారని, దానిని ప్రారంభించినట్లు సీతక్క తెలిపారు. అధికారులు, వీవీఐపీలు వచ్చినా ఈ కార్యాలయం ఉపయోగ పడుతుందన్నారు. ఏటూరునాగారంలో జెడ్పీటీసీగా ఎన్నికైన వ్యక్తి ఈ భవనం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం మామిడిమొక్కలను నాటారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, జెడ్పీ సీఈఓ సంపత్‌రావు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, తహశీల్దార్ జగదీష్, ఎంపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు రఘు అయ్యోబ్‌ఖాన్ గుడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

**ప్రజల మన్ననను పొందేలా ఉండాలి**

శ్రీలక్ష్మీ నారాయణ ఫంక్షన్‌హాల్ ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ నాయకుడు పోగుల లక్ష్మీనారాయణ నిర్మించిన ఎస్ఎల్ఎన్ పంక్షన్ హాల్‌ను సీతక్క ప్రారంభించి మాట్లాడారు. పది మందికి ఉపాధి కల్పించే ఇలాంటి ఫంక్షన్‌హాల్ మరింత అభివద్ధి చెందాల న్నారు. అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. కార్య క్రమంలో నాయకులు దేవేందర్, ఎల్లయ్య, ఆయూబ్, ఖలీల్, రవి, శ్రీను, సర్దార్, వలియాబీ, అరుణ, రాధిక, సరిత, సఫియా పాల్గొన్నారు.



## కార్మిక హక్కుల కోసం పోరాడిన వ్యక్తి గ్యానం సారయ్య

**4 వర్ధంతి సభలో సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్, కృష్ణారెడ్డి**

**నవతెలంగాణ-వెంకటాపురం**

కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి గ్యానం సారయ్య తన ఆశయం కోసం కార్మికులు, కర్షకులు, గిరిజన, గిరిజనేతర సమస్యల కోసం పోరాటాలు చేయడమే మనం సారయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్, సూడి కృష్ణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ వంకా రాములు అధ్యక్షతన గ్యానం సారయ్య 4వవర్థంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గం వెంకటాపురం మండలంలో సీపీఐ(ఎం) పార్టీ ఎదుగుదలకు దశాబ్దాలుగా పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు. తన నివాస గహమే ఓ పార్టీ కార్యాలయం అన్నారు. ఎక్కడ పేదలకు సమస్య వచ్చినా వారి హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సారయ్య అని గుర్తు చేశారు. పార్టీ కార్యకర్తగా చేరి సీపీఐ(ఎం) పార్టీలో అంచెలంచలుగా ఎదుగుతూ పలు పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా నాయకులు సాంబశివ, రాజేందర్, దావూద్,గఫూర్, రాజేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కుమ్మరి.శ్రీను, చిరంజీవి, చిన్న, పాల్గొన్నారు.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**నవతెలంగాణ-శాయంపేట**

గ్రామాలలోని ప్రతి గడపగడపకు పోస్ట్ ఆఫీస్ సేవలు అందజేస్తుందని, ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ మారపల్లి క్రాంత్ కుమార్, ఆర్‌పిఈ సముద్రాల లింగమూర్తి అన్నారు. శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పోస్టల్ సేవలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్యఅతిథిగా వారు పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తు ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా 24గంటలు పోస్టల్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లల భవిష్యత్తు ఉపయోగాలకు, చదువులకు, వివాహాలకు, హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ లాంటి అనేక సౌకర్యాలను అందిస్తుందని అన్నారు. కేవలం రూ.555లతో రూ.10 లక్షల ప్రమాద బీమా, రూ.755ల ప్రీమియంతో రూ.15 లక్షలు ప్రమాద బీమా సౌకర్యం ఉందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 72880 37313 ద్వారా సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

## హెల్ప్ డెస్క్‌కు దరఖాస్తుల వెల్లువ



**నవతెలంగాణ-శాయంపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ ప్రకటించి అమలు చేయడంతో, రుణమాఫీ వర్తించని రైతులు శాయంపేట గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో రుణమాఫీ పై దరఖాస్తులు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 360 దరఖాస్తులు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి గంగాజమున తెలిపారు. రుణమాఫీ వర్తించని రైతులు చేస్తున్న దరఖాస్తులతో రైతు వేదిక ప్రాంగణం కిటకిట లాడుతోంది. రుణమాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, హెల్ప్ డెస్క్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏవో తెలిపారు.

## గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు గౌడ్

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండ వెంకటేశ్వర్లుగౌడ్‌ని నియమిస్తూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా తెలంగాణలో ఉన్నటువంటి గౌడ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సేవలను గుర్తించి మండ వెంకటేశ్వర్లుగౌడ్‌ని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఈసందర్భంగా మండ వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ గౌడ కుల అభివృద్ధికి, తెలంగాణ గౌడ సంఘం ఆశయాలకు, లక్ష్యాలకు, సంక్షేమం కోసం గౌడులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి కృషి చేస్తానని, నాపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు గాను రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారగోని కుమారస్వామి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, నాయకులు మార్క అనిల్ కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు దూలం రాజేందర్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**

కామారెడ్డి డిక్లరేషన్‌పై తెలంగాణలో జరుగుతున్నటువంటి పరిణామాల పైన చర్చించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ బిసి రైట్స్ ఏర్పాటుచేసి తాత్కాలికంగా 25 మంది కమిటీ తోటి ఫాస్ట్ ట్రాక్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు శనివారం మధ్యాహ్నం 2గంటలకు న్యూలయోలా హై స్కూల్‌లో చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులు మేధావులు ప్రొఫెసర్లు అభ్యుదయవాదులు బిసి సంఘాలు, కుల సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ కమిటీ ప్రతి రోజు బీసీల హక్కుల కోసం ముఖ్యంగా కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం రోజుకు ఒక కార్యక్రమం నిరసన రూపంగా ప్రభుత్వానికి తెలియజేసేందుకు వెంటనే ఒక కార్యాచరణను తీసుకొని ముందుకు వెళ్లేందుకు నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బ్రహ్మోత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులు

**నవతెలంగాణ-శాయంపేట**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు శ్రీ పరచారం భవనారాయణ చార్యుల బృందం ఆధ్వర్యంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటర మణారెడ్డి, వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఉత్సవాలలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్, మాజీ ఎంపిటిసి గడిపే విజయ విజయ్ కుమార్, నాయకులు సావుల్ల కిష్టయ్య, దాసి శ్రవణ్ కుమార్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-గూడూరు**



మండలంలోని మట్టెవాడ గ్రామంలో ముత్యాలమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ శాంతి పూజలో భాగంగా పొలిమేర దారిలో తోరణాలు కట్టి పూజలు నిర్వహించారు. హోమగుండాల పూజా కార్య క్రమాలు చేశారు హోమములతో పూజలు చేసి వర్షాలు బాగా పడాలని, గ్రామంలో పెద్దలు, వద్దులు పిల్లలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషంతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని, గ్రామ దేవతలకు పాలభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## కుటుంబ నిర్ధారణ సర్వే సమర్థవంతంగా ఉండాలి..

### సర్వేను పరిశీలించిన ఎడీఏ వి.విజయ్‌చంద్ర

**నవతెలంగాణ-మరిపెడ**



రైతు రుణమాఫీ రాక ఇబ్బంది పడుతున్న రైతులకు కుటుంబ నిర్ధారణ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మరిపెడ ఎడీఎ వి.విజయ్ చంద్రఅన్నారు. శుక్రవారం మండలంలోని వీరారం , బాల్యతండా గ్రామాల పరిధిలో ఉన్న రైతురుణమాఫీ అమలుగాక ఉన్న రైతుల కుటుంబ వివరాలను సేకరించారు. అందులో ఉన్న తప్పులను పరిశీలించారు. ఈసర్వేను ఏడిఏ తనిఖీ చేస్తూ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మరొకసారి రైతులకు రుణమాఫీ చేయటానికి అవకాశం ఇవ్వడంతో కుటుంబ సర్వేలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే మందులు వాడాలని, ప్రైవేట్ కంపెనీల వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి బి. వీరాసింగ్ ఏఈఓ శ్వేత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అలవాట్లు పెంపొందించుకోవాలి

**నవతెలంగాణ-కమలాపూర్**




విద్యార్థులు మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సాకేత విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మంజుల వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం హసన్ పర్తి మండలంలోని భీమారంలో సాకేతపాఠశాలలో మంచి అలవాట్లను 'పెంపొందించు కోవడం' అనే అంశంపై నర్సరీ, కేఏస్ విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న సమాజంలో నైతిక విలువలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాట సంస్కారానికి పెద్దపీట వేయాలన్న ఆలోచనలో భాగంగా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాకేత విద్యాసంస్థల వ్యవస్థాపకులు వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలో మనుస్యుల మధ్య రాగ, ద్వేషాలు పెరుగుతున్నామని, సమాజంలో మనుషులంతా సమానమని కుటంబ భావనతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేంగుక స్కూల్ ఇంచార్జి అబిజ్, సాషా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు దోమల నివారణ పద్ధతులు పాటించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ కే.లలితాదేవి



**నవతెలంగాణ-సుబేదారి**

ప్రతి ఒక్కరు దోమల నివారణ పద్ధతులు పాటించాలని హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ కే.లలితాదేవి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో నీరునిల్వ ఉండే అవకాశమున్న అన్ని వస్తువులు, వాడని పాత సామాగ్రి విషయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ కొద్ది పాటి నీరైనా ఐదు రోజుల కంటే ఎక్కువగా నిల్వ ఉన్నట్లయితే అందులో దోమలు గుడ్లుపెట్టే అవకాశం ఉందని ఆరోగ్య సిబ్బంది డ్రైడే కార్యక్రమాలు నిర్వహించిన ప్పుడు పాత ఇనుప సామాన్లు, పగిలిన ప్లాస్టిక్ సామాను నిల్వ ఉంచే షాపుల్లోని సామాగ్రిలో, పంక్చర్ షాపుల దగ్గర ఉన్నటువంటి పాత టైర్లు, అలాగే ఖాళీ ప్రదేశాల్లో పారవేసిన కొబ్బరి బొండాల్లో, కాలనీలలోని ఖాళీ ప్లాట్ లలో దోమ లార్వాలను గుర్తించడం జరిగిందని, అందువలన సంబంధిత యజమానులు తమ తమ ఆవరణలోని పాత సామాన్లలో, టైర్లలో, ఖాళీ బాటిల్స్ లో నీరు నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు.

సీజనల్ వ్యాధుల నివారణలో ప్రభుత్వ విభాగాలతో పాటుగా ప్రజలు కూడా తమ ఇళ్లలో పరిసరాలలో నీరునిల్వ ఉండకుండా అలాగే పరిశుభ్రంగా ఉంచడం తమ వంతు బాధ్యతగా భావించి ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటిస్తూ నీరు నిల్వ ఉంచే పాత్రలన్నీ ఖాళీచేసి ఆరబెట్టి తిరిగి వాడుకోవాలన్నారు. పగిలిన వస్తువుల్లో నీరు లేకుండా చూడాలన్నారు. అలాగే నీరు నిల్వ ఉండే గుంటల్లో వాడిన ఇంజన్‌ఆయిల్‌లో ముంచినటువంటి గుడ్డ ఉండలను వేయాలన్నారు. దీని వలన ఆయిల్‌లేయర్ ల పేర్కొని ఆక్సిజన్ అందకపోవడం వలన దోమ లార్వ దశలోనే చనిపోతాయన్నారు.

# జ్యోతినగర్‌లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం





**నవతెలంగాణ-సుబేదారి**

గ్యాస్ సిలిండర్‌పేలి ఇల్లు పూర్తిగా ధ్వంసమైన ఘటన శుక్రవారం ఉదయం 11 గంటలకు హనుమకొండ హంటర్ రోడ్డు దీన్‌దయాల్ నగర్ పక్కన జ్యోతినగర్‌లో చోటుచేసుకుంది. గుండ్లపల్లి గురువారెడ్డి భార్య కోటేశ్వరి ఉదయం 10 గంటలకు మట్టి కూలీ పనులకు వెళ్లారు. ఇంటి పక్కన వాళ్ళు చూసి ఇంట్లో నుండి పొగలు వస్తున్నాయని తెలపగా ఇంటికి వచ్చారు. ఫైర్ ఇంజనుకు ఫోను చేయగా వాళ్ళు రెండు గంటలైనా రాక పోగా వరంగల్ గొర్రెకుంట నుండి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. మొత్తం సిలిండర్ పేలి ఇల్లంతా ధ్వంసమైంది. ఇంట్లో దాచుకున్న 3తులాల బంగారం, రూ.25 వేల నగదు బీరువాలో పెట్టగాఅది కూడా కాలిపోయింది. 2 క్వింటాళ్ల బియ్యం ఉం డే అవి కాలి బుడిదాయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకు నష్టపోయినమని ఇద్దరు దంపతులు బోరున విలిపించారు. ఈ క్రమంలో సీపీఐ (ఎం) నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, దొగ్గేల తిరుపతి, కంచర్ల కుమార్, నోములకిషోర్, ధూడపాక రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే నిత్యవసర వస్తువులను అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

# ఇంకుడుగుంతల బిల్లులు చెల్లించాలని ఆగ్రహం



**నవతెలంగాణ-శాయంపేట**

ఉపాధి హామీ పనులపై జరిగిన గ్రామ సభలో 2019లో నిర్మించిన ఇంకుడు గుంతల నిర్మాణాలకు బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదని మాజీ వార్డు సభ్యుడు గొట్టిముక్కల చక్రపాణి గ్రామసభలో పాల్గొన్న అధికారులను నిలదీశారు. శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులపై 15వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. సామాజిక తనిఖీ సభ్యులు గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై విచారణ చేపట్టి, రికార్డులను పరిశీలించి, కూలీలతో మాట్లాడి గ్రామసభలో ఉపాధి పనుల్లో జరిగిన పొరపాట్లను చదివి వినిపించారు. బాధ్యుల నుండి వివరణ తీసుకున్నారు. ఇంకుడు గుంతల బిల్లుల చెల్లింపు విషయమై మాజీవార్డు సభ్యుడు చక్రపాణి ప్రశ్నించడంతో ఏపీవో కీర్తి అనిత జోక్యం చేసుకొని జిల్లాలు మారడంవల్ల టెక్నికల్ సమస్య తలెత్తడంతో ఇంకుడు గుంతల బిల్లుల పేమెంట్ జరగలేదని, టెక్నికల్ సమస్య పరిష్కారం కాగానే వెంటనే బిల్లు పేమెంట్ చేస్తామని తెలిపారు. స్మశాన వాటికలో నాటిన మొక్కలు చనిపోయాయని, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటిస్తామన్నారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న జాబ్ కార్డు ఇవ్వడం లేదని సామాజిక తనిఖీ సభ్యుల దృష్టికి దైనంపల్లి సదానందం తీసుకెళ్లడంతో టీం సభ్యులు ఏపీవో దష్టికి తీసుకెళ్లి జాబ్ కార్డు తయారు చేయించి గ్రామసభలో అందజేశారు.

ఈ గ్రామసభలో డీటీ ప్రభావతి, సోషల్ ఆడిట్ డిఆర్‌పి కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, ఫీల్డ్‌అసిస్టెంట్ రేణికుంట్ల సదయ్య, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సామూహిక వరలక్ష్మి వ్రతం చేయడం అభినందనీయం



**నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ ఝాన్సీరెడ్డి**

**నవతెలంగాణ-తొర్రూరు**

డివిజన్ కేంద్రంలోని శ్రీ మురళీ కృష్ణ మందిరంలో 14 ఏళ్లుగా వరలక్ష్మి మాతకు శ్రావణమాసంలో సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేయడం అభినందనీయమని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని మందిరంలో సుందర సత్సంగ మాత మండలి అధ్యక్షురాలు మాశెట్టి జమున ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మిమాతకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ ప్రత్యేకపూజలో హనుమాన్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి పాల్గొని మహిళలకు అమ్మవారి దగ్గర పూజించిన గాజులను వితరణ చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి చేయూతనిస్తామన్నారు. ఇటీవల తాము అమెరికా వెళ్లినప్పుడు అక్కడ వరలక్ష్మి వ్రతం ఆచరించామని, తొర్రూరు లో సామూహిక పూజ లో పాల్గొనే అవకాశం రావడం అమ్మ వారి అనుగ్రహమని అన్నారు. పూజలో పాల్గొన్న మహిళా భక్తులు ఝాన్సీరెడ్డికి పసుపు, కుంకుమ అందజేశారు. అందరికి అమ్మ వారి, శ్రీ కృష్ణ భగవానుని ఆశీస్సులు ఉండాలని అభిలాషించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈకార్యక్రమంలో సుందర సత్సంగం నిర్వాహకులు ఎ.మోహ న్ రెడ్డి, రఘుపతి, రమేష్, లక్ష్మినారాయణ, అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కృపాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమదానం చేసిన పాత్రికేయులు

**నవతెలంగాణ-కేసముద్రంరూరల్:**



కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పరిసరాలను శుభ్రం చేసేందుకు టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ (పాత్రికేయులు) ముందుకొచ్చారు. పాఠశాల ఆవరణలో రాకపోకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతుండగా టియూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ మండల అధ్యక్షుడు ఎసల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం చేపట్టారు. ఈకార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య, స్థానిక ఎస్సై మురళీధర్ రాజ్ పాల్గొని పారతో మొరం చదును చేశారు. అనంతరం పాత్రికేయులు, విద్యార్థులతో కలిసి సిఐ, ఎస్సై మొక్కలు నాటారు. ఈసందర్భంగా సిఐ సర్వయ్య మాట్లాడుతూ కేసముద్రం పాత్రికేయులు తమ ఉదార స్వభావంతో స్పందించి వర్షాలకు పాఠశాల ఆవరణలో నీటి నిల్వలకు ఎలాంటి తావు లేకుండా మొరంపోసి చదును చేయడం అభినందనీయమన్నారు. గతంలో కరోనా కష్టకాలంలో నిరుపేదలకు నిత్యవసర సరుకులను అందజేయడం, వివిధ పాఠశాలలలో ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో గాజుల రవి, వేల్పుల రేవంత్, రవిచంద్ర, యాకన్న,రాజు, మహేందర్, వంశీ, ప్రధానోపాధ్యాయులు బండెల రాజు, శ్రీనివాస్, మధు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు.. వెంటనే డబ్బులు చెల్లించాలి

### టీడీపీ మండల అధ్యక్షుడు బైన భిక్షపతి

**నవతెలంగాణ-పెద్దవంగర:**



రుణమాఫీ ప్రక్రియలో రైతులను బ్యాంకర్లు ఇబ్బంది పెట్టొద్దని టీడీపీ మండల అధ్యక్షుడు బైన భిక్షపతి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తిరిగి అప్పు ఇచ్చే విషయంలో వారికి పూర్తిగా బ్యాంకర్లు సహకరించాలన్నారు. రుణమాఫీ జరిగిన రైతులకు వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. రైతులు రెన్యువల్ చేయడం కోసం తిండి తిప్పలు లేక, వ్యవసాయ పనులను వదులుకొని నెలరోజుల నుంచి బ్యాంకు చుట్టూ రైతులు తిరుగుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రమపద్ధతిలో రుణమాఫీ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ రెన్యువల్ కోసం రైతులు వన్‌బీ, పాస్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్ ఫొటో తీసుకురావాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు గురిజాల సోమిరెడ్డి, పెద్ది అనిల్, పెద్ది వెంకన్న, మార్గం సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఛాంపియన్ ఆసియాను ఆదర్శంగా తీసుకోవాలి



**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**

కర్ణాటకలో రాష్ట్రంలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో పతకాలు సాధించిన ఆసియాను టీఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ నీరజారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నీరజారెడ్డి మాట్లాడుతూ మహిళలు బాలికల పట్ల సమాజంలో జరుగుతున్న సంఘటనలకు చెక్ పెట్టాలంటే ఆత్మరక్షణ ఎంతో అవసరం అని ఆసియాను ఆదర్శంగా తీసుకొని చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలు అందరూ అలవర్చుకోవాలని ఇంటర్నేషనల్ స్థాయిలో బంగారు పతకం సాధించిన తమ కళాశాలలో చదువుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఇలాంటి పథకాలు మరిన్ని సాధించి ఇటు కళాశాలకు వాటి తల్లిదండ్రుల పేర్లను నిలబెట్టాలన్నారు.

ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటిలు, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**నవతెలంగాణ-వేలేరు**

ఓ వివాహితను మాయ మాటలతో మభ్యపెట్టి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు సతీష్ అనే వ్యక్తి తనను వివాహం చేసుకుని ఇపుడు ముఖం చాటేస్తూ మోసం చేశాడని దేవులపల్లి పావని అనే వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సతీష్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.

## శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దు

**నవతెలంగాణ-వేలేరు**



ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ప్రజలకు ఇబ్బంది కలిగించేలా గణేష్ మండపాల నిర్వాహకులు వ్యవహరించవద్దని ఎస్ఐ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల గణేష్ మండపాల నిర్వాహ కులను , ఉత్సవ కమిటీలతో మాట్లాడి సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నియమ నిబంధనల మేరకు అనుమతి తీసుకొని గణేష్ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఉత్సవాలు ఉండకూడదన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకుంటే సమస్య ఉండదన్నారు. పోలీస్ నియమ నిబంధనలను అనుకూలంగా ఉత్సవాలు జరుపుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

**నవతెలంగాణ-గార్ల**

ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్-కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్వర్యంలో సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షులు బాధావత్ శ్రీను, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్‌రావులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ పీఎఫ్‌ఆర్డీఎ చట్టం ప్రకారం ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్ విధానం వలన ఉద్యోగులకు పదవీ విరమణ తరువాత కనీస పెన్షన్ అందకుండా, సామాజిక, ఆర్థిక భద్రత లేకుండా చేసిందని ఆవేదన వెలిబుచ్చారు. 2004 సెప్టెంబర్ 1 నుండి సీపీఎస్ అమలు చేస్తున్నారని, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ జిల్లా కేంద్రంలో సాయంత్రం 4.40 నిమిషాల నుండి నిరసన ప్రదర్శనలు జరుగుతాయని ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించి సుమారు లక్ష 70 వేల ఉద్యోగుల కుటుంబాలలో వెలుగు నింపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాలోతు శివనాయక్, ఈరు నాయక్, భోజ్యానాయక్, హీరలాల్, భాస్కర్, నాగేశ్వరరావు, రాము, రమేష్, నరేష్, వీర్య, సంతులాల్, శ్రీనివాస్, పడిత్యా, శివ, వీరభద్రం, కొటాయ్య, రవి,నరేందర్, మంగీలాల్, బాసు తదితరులు పాల్గొన్నారు.


## సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం జయప్రదం చేయాలి

**నవతెలంగాణ-మహబూబాబాద్**

రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం సెప్టెంబర్ 1న అమరవీరుల స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ సభ్యులందరూ పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయుటకు రావాలని జేఏసీ మహబూబాద్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్ నందు జేఏసీ నాయకులు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రఫీ, జెఎసి చైర్మన్ వడ్డే పోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో టిజిఓస్ జిల్లా అధ్యక్షులు మహ్మద్‌రఫీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే.యాకుబ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు బలాష్టి రమేష్, పీఆర్‌టీయూ మహబూబాబాద్ మండల అధ్యక్షులు కల్లం వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి, భూక్య రామోజీ నాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు యాకుబ్, టీఎన్జీవో జిల్లా ట్రెజరర్ మైస రోహిత్‌కుమార్, డీఈవో రాష్ట్ర బాధ్యులు వేల్పుల శ్రీనివాస్, ఎంప్లాయిస్ నాయకులు వలబోసు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో యజ్ఞేష్ కృష్ణకు బంగారు పతకం

**నవతెలంగాణ-మహబూబాబాద్**



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏకశిలా ఏంజెల్ స్కూల్‌లో జరిగిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ మాథ్స్ సైన్స్ టెస్టుల్లో జాతీయస్థాయిలో దేశ బోయిన యజ్ నేష్ కృష్ణ బంగారు పథకం సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.రమేష్ తెలిపారు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థికి బంగారు పతకం, సర్టిఫికెట్ అందజేశారు. మహబూబాద్ పట్టణానికి చెందిన దేశ బోయిన కవిత- రాధాకృష్ణల కుమారుడు యజ్ నేష్ కృష్ణ. జాతీయ స్థాయిలో బంగారు పథకం సాధించడం ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. మునుముందు ఇంకా ఇలాంటి పోటీ పరీక్షలలో పాల్గొని జాతీయస్థాయిలో మన మహబూబాద్ పేరు నిలబెట్టాలని సూచించారు.

2023-2024 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ మాథ్స్ సైన్స్ పోటీపరీక్షల్లో ఏకశిలా ఏంజెల్స్ లో 9వ తరగతి చదువుతున్న దేశబోయిన యజ్ నేష్ కష్ణ జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ పొందిన విద్యార్థికి పాఠశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ రెడ్డి మెడల్స్, సర్టిఫికెట్స్‌తో సత్కరించారు. ఈకార్య క్రమంలో ఇన్‌ఛార్జ్‌లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌ను కలిసిన కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టు మిత్రులు



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్
జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలోని అడిషనల్ ఎస్పీ ఛాంబర్‌లో జిల్లా అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌ను శుక్రవారం కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జర్నలిస్టులు సహకరించాలని అన్నారు. పోలీసులు, జర్నలిస్టులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, సామంతుల శ్యామ్, జల్ది రమేష్, సామల శ్రీనివాస్, దోమ్మటి రవీందర్, బండ మోహన్, కడపాక రవి, బోట్ల వివేకానంద, పుల్ల సజన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మౌనిక-ప్రణీత్' దంపతుల ఆపన్నహస్తం



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్
భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హెచ్ఎంఆర్డీ స్వచ్ఛంద సేవా కార్యాలయంలో చెవిటి, మూగ విద్యార్థులకు ములుగు సర్పంచ్ బండారి నిర్మల హరినాథ్ కుమార్తె బండారి మౌనిక -ప్రణీత్ దంపతులు ఆపన్న హస్తం అందించారు. శుక్రవారం సదరు విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్‌తోపాటు బకెట్లు, మగ్గులు బెడ్ షీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మూగ విద్యార్థికి రూ.15000 విలువైన వినికిడి పరికరం అందించేందుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఆర్డీ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రజిత రాజయ్య, ములుగు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గణపురం
శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాలలో శుక్రవారం కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు జూలపల్లి నాగరాజు పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో ఆలయానికి సందర్శకులు పోటెత్తారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మహదేవపూర్
మహాముత్తారం మండలం లోని బోర్లగూడెం మతంకుంట ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కాగితపు వెంకటాచారి మృదంగ వాయిద్యంతో భజన కార్యక్రమం ప్రారంభించారు. నేటితో భజన కార్యక్రమం ముగుస్తుందని ఆలయ చైర్మన్ తెలిపారు. ఆలయ నూతన అధ్యక్షుడు రంగు రవిందర్‌గౌడ్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు అందే భాస్కరాచారి, గంట కేశవరెడ్డి, సూరెడ్డి నర్సింహారెడ్డి, సుదాటి బాపురావు, ఐర్నేని భాస్కర్‌రావు, ఠాకూర్ లక్ష్మణ్, దాస్యపు లక్ష్మీనారాయణ, కాగితపు నాగేశ్వరాచారి, అందె రాజయ్య, రత్నం సాగర్, సుదాటి జగపతిరావు, ఓడెల భాస్కర్, మామిండ్లపెల్లి శ్రీనివాసరావు, బానోత్ లాక్కునాయక్, మాలోత్ నవరామ్, అజ్మీరా ధరమ్ సింగ్, లావుద్య రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

## సరేందర్‌కు కళాకరుల పరామర్శ



నవతెలంగాణ-మహదేవపూర్
కాంగ్రెస్ పార్టీ మహదేపూర్ మండలం చంద్రుపల్లి గ్రామ సీనియర్ నాయకురాలు దుర్గమ్మ ఇటీవల మృతిచెందింది. శుక్రవారం స్థానిక కళాకారులు అందరూ దుర్గమ్మ కొడుకు, ప్రముఖ కళాకారుడు బల్లి సురేందర్‌ను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, అన్నారం మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య మాజీ సర్పంచ్ సురేందర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-భూపాలపల్లి డెస్క్
మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆస్పత్రిలోని రోగులకు, అంకుషాపూర్, సోమనపల్లి, అంగన్‌వాడీ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత మోర్చ నాయకులు బట్టు రవి, మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, బండారి సమ్మయ్య, నాయకులు తిరుపతి కుమార్, సిద్ధు, మహేందర్, లక్ష్మయ్య, రమేష్ , స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి : ఎస్సై రేఖ అశోక్

నవతెలంగాణ-గణపురం




చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ రేఖ అశోక్ అన్నారు. శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండల లోని కర్కపల్లి గ్రామంలో మహారాజుల కాలనీ వద్ద గణపురం రెవెన్యూ ఆర్ఐ రహమత్ పాషా, గణపురం పోలీసుల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంటరానితనం, ఎస్సీ, ఎస్టీ చట్టం గురించి అవగాహన, చదువు ప్రాధాన్యతతోపాటు డయల్ 100 పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

# పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-మహాదేవపూర్
ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం మహాదేవపూర్ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలల సముదాయాన్ని పరిశీలించారు. అటవీ, రెవెన్యూ, భూముల వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని, పూర్తైన పనులకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణంలో జాప్యం జరుగుతోందని, తక్షణమే కాంట్రాక్టర్‌ను తొలగించి మరో కాంట్రాక్టర్‌కు నిర్మాణ భాద్యతలు అప్పగించి త్వరగా అందుబాటులోకి తేవాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న మాడా భవన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల నివేదికను అందజేయాలని ఆదేశించారు. అనంతరం డయాలసిస్ విభాగం, క్యాజువాలిటీ, జనరల్ వార్డులను పరిశీలించి రోగుల వైద్య సేవల గురించి ఆరా తీశారు.








వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై-డే పాటించాలని సూచించారు. ఆస్పత్రి వెనుక వైపు ప్రహరీ కోసం వెంటనే ప్రతిపాదనలు అందచేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సముదాయాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో బాలురు, బాలికల కోసం నూతన మరుగుదొడ్ల నిర్మించాలని ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న గదులకు తలుపులు, కిటికీలు, మరమ్మతులు చేయడానికి వెంటనే నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాలికల పాఠశాలలో ముఖ కదలికల ద్వారా మాట్లాడగలిగే విద్యార్థుల నైపుణ్యతను పరీక్షించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ప్రసాద్ రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ డాక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రాణిభాయ్, నాయకులు రాజబాబు, వామన్‌రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతే కీలకం

- అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు

నవతెలంగాణ-మహదేవపూర్
సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతే కీలకం అని అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు సూచించారు. శుక్రవారం అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మహదేవపూర్, పలిమెల మండలాల గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టి ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇండ్లలో ఉన్న గోళాలు, నీటి డ్రమ్ములు,



కుండలు, సంపులు, రోళ్లు, వాడిపడేసిన కొబ్బరి బోండాలు, ఖాళీ సీసాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తితో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా ఫైలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారం విధిగా డ్రై డే కార్యక్రమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సోనాలి, హెల్త్ సూపర్వైజర్ మసకలి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ ఏఎన్ఎం స్వరూప, ఆశ వర్కర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా... కేసులు నమోదు

నవతెలంగాణ-భూపాలపల్లి డెస్క్
జయశంకర్-భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొరికిషాల గ్రామ పంచాయతీ పరిధి బద్దంపల్లె శివారులోని ఇసుక డంపును పోలిస్, రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు తహసీల్దార్ సునిత, ఎస్సై అశోక్ ఆదేశాలతో పోలిస్, రెవెన్యూ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. బద్దంపల్లె శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చట్ట విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 25 ట్రిప్పుల ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు. ఇసుక డంపును ఇతర ప్రాంతాలకు తరలించకుండా కోర్కిశాల పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు అప్పగించారు. మొగుళ్ళపల్లి వాగుల నుండి అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమని



పోలీసు రెవెన్యూ అధికారులు నిఘా కట్టుదిట్టం చేసి పర్యవేక్షిస్తుంటారని ఆర్ఐ హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరిపై కేసు : ఎస్సై సందీప్‌కుమార్

రేగొండ : ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం రేగొండ ఎస్సై సందీప్ కుమార్ తన సిబ్బందితో లింగాల క్రాస్ వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. కాల్వపల్లి నుండి వస్తున్న



ఇసుక లారీ, ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీ యజమాని శ్రీనివాసరావు, ట్రాక్టర్ యజమాని కాల్వపల్లి గ్రామానికి చెందిన ముర్రి హరీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే మండలంలోని దమ్మన్నపేట, రాయపల్లి, లింగాల క్రాస్ వద్ద ఉన్న మూడు ఇసుక డంపులను సీజ్ చేశామని, సుమారు 20 ట్రాక్టర్ల ఇసుక ఉంటుందని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.



## బాధితురాలికి పుట్ట మధు పరామర్శ

నవతెలంగాణ-మల్హర్‌రావు
కాటారం మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన పగడాల స్వర్ణలతను ఇటీవల దోపిడీ దొంగలు కత్తితో గొంతు కోయగా తీవ్రంగా గాయపడి భూపాలపల్లి యోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. శుక్రవారం సదరు బాధితురాలిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. అధైర్య పడొద్దు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొనె శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కులగణనలో వికలాంగుల లెక్కలు తేల్చాలి

నవతెలంగాణ-గణపురం
కుల గణనలో వికలాంగుల లెక్కలు తేల్చాలని గణపురం మండలం వికలాంగుల అధ్యక్షుడు భూక్యా హరిలాల్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం అమలైన తర్వాత 21 రకాల వికలాంగుల లెక్కలు తేల్చ లేదని అన్నారు. 2011 లెక్కల్లో 1995 చట్టం ప్రకారం 7 రకాల లెక్కలు మాత్రమే చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కులగణనలో వికలాంగుల లెక్కలు తేల్చి స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

## నేడు మాదకద్రవ్యాల నిర్మూలనకు 2కె రన్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్
మాదకద్రవ్యాల నివారణకు నేడు ఉదయం 7గంటలకు భూపాలపల్లి సిఆర్‌నగర్(బాంబులగడ్డ) నుండి అంబేద్కర్ కూడలి వరకు 2కెరన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని న్యాయవాదులు వి శ్రావణ్‌రావు, బి రమేష్ నాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ హాజరవుతున్నా రని, ప్రతిఒక్కరు పాల్గొని గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు.

## ఇంటి వద్దకే.. సీఎంఆర్ఎఫ్ చెక్కులు



నవతెలంగాణ-మల్హర్‌రావు
మంథని నియోజకవర్గంలోని మల్హర్‌రావు, కాటారం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు. మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం కాటారం మండలానికి 44 చెక్కులు, మల్హర్‌రావు మండలానికి 56 సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంత్రి సహచరుడు ఆకుల చంద్రశేఖర్ అందజేశారు. మండలంలోని మల్లారం, తాడిచెర్ల, ఇప్పలపల్లి, కుంభంపల్లి, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, కొండంపేట, వల్లెంకుంట, ఎడ్లపల్లి, రుద్రా రం గ్రామాల్లో, కాటారం మండలం బస్వాపూర్, కొత్తపల్లి, బయ్యారం, కాటారం, ఇబ్రహీంపల్లి, చిదనపల్లి, గొల్లపల్లి, దంతాలపల్లి, చింతకాని, కిష్టరావుపేట, ఆదివారంపేట, ధన్వాడ, శంకరంపల్లి, జాదురావుపేట, లక్ష్మీపూర్, సుందరాజిపేట, దేవరంపల్లి, గంట్ల గూడెం, గంగారం, గ్రామ లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్టు ఆయన తెలిపారు.



మహాదేవపూర్ మండలంలో శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్య టించారు. ఈ సందర్భంగా పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నవతెలంగాణ-మహాదేవపూర్

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ, విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-రేగొండ
మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో శుక్రవారం వాసవి క్లబ్ (రేగొండ) ఆధ్వర్యంలో బతుకమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ అవిష్కరణ పూజా కార్యక్రమాల్లో భూదాత, గద్దె నిర్మాణ దాత రంగయ్యపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దగ్గు సంధ్యారాణి వెంకటేశ్వర్లు, విగ్రహ దాత గార్లపాటి శ్రీనివాసులు శ్రీలత, ఎర్రం సదాశివశంకర్ అనసూర్య పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ వైస్ గవర్నర్ గుమ్మడవెల్లి సత్యనారాయణ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వాసవి క్లబ్ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు కటకం రాజు, ఉపాధ్యక్షులు నూనె మురళీధర్, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, మాజీ సర్పంచ్ బొజ్జం రవి, పంచాయతీ కార్యదర్శి జీవిత , యిరుకుల అమర్నాథ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీ ఉదయ్ హాస్పిటల్' ప్రారంభం

ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ హాజరు



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్
భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరునగర్‌లో జనరల్ ఫిజీషియన్(గాంధీ మెడికల్ హాస్పిటల్) శ్రీపతి ప్రేమ్‌సాగర్ ఏర్పాటు చేసిన శ్రీ ఉదయ్ హాస్పిటల్‌ను శుక్రవారం ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, ఉపాధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్ట్ బోర్డు చైర్మెన్ ఎంపికకు ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-మహదేవపూర్
మహాదేవపూర్ మండలం లోని శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కాళేశ్వరం దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఏ మారుతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం అయినవోలు శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, మడికొండ వీరభద్ర స్వామి దేవాలయం, కురవి మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయాల చైర్మన్‌ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవుల కోసం ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 'సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి'

నవతెలంగాణ-రేగొండ
గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునుతుల నిశిదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జి నాగపురి రాజమౌళిగౌడ్‌తో హాజరై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు, బుచ్చిరెడ్డి, వేణురావు, రవి, మండల ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, బండి శీను, బీజేవైఎం రాష్ట్ర నాయకులు గాలిఫ్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

12
నవతెలంగాణ
సమస్త తెలుగు వేదిక
జనగామ
శనివారం ఆగస్టు 31, 2024 | www.navatelangana.com

## తొలగించిన చోటే జెండాగద్దెను నిర్మించాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



అంబేద్కర్ జెండా గద్దెను తొలగించిన చోటే నిర్మించాలని దళితనాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని రాఘవాపూర్‌లో అంబేద్కర్ జెండాగద్దె తొలగింపుపై నెలకొన్న వివాదంలో భాగంగా శుక్రవారం రసాభాస నెలకొంది. ఈ సందర్భంగా దళిత హక్కులపోరాట సమితి నాయకులు పైసా రాములు, పరంజ్యోతి, గాదె రాములు, కొయ్యడ మల్లేష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. మండలంలోని రాఘవాపూర్‌లో బీఆర్‌అంబేద్కర్ జెండా గద్దెను తొగించడాన్ని నిరసించారు. తొలగించిన చోటే తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఇతర సామాజిక వర్గాలను తామేమీ ఇబ్బందులకు గురి చేస్తలేమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా దళితుల్ని వివక్షతతో చూడకుండా తమ హక్కుల్ని కాపాడాలని అన్నారు. ఈకార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పైసా రాములు, పరంజ్యోతి, గాదె రాములు, కొయ్యడ మల్లేష్, గ్రామ దళిత నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- జనగామ ఏసీపీ కొండం పార్థసారథి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు వేస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో జనగామ ఏసిపి కొండం పార్థసారథి గురువారం రాత్రి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం లేకుండా పండుగను అందరూ సోదరభావంతో, సామరస్యపూర్వకంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని, ప్రజలకు తమ స్థాయిలో అవగాహన కల్పించాలని శాంతి కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇతర మతాల వారి మనోభావాలను దెబ్బతీసే పనులు చేయవద్దని, పండుగ సందర్భంగా సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే వదంతులపై గట్టి నిఘా ఉంచడంతోపాటు సంఘ వ్యతిరేకులు, అశాంతిని వ్యాప్తి చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనగామ ప్రజలు పండుగ వాతావరణంలో ఒకరి మనోభావాలను గౌరవిస్తూ గణేష్ పండుగ జరుపుకోవాలని, సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా ఏదైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలో ఏదైనా అభ్యంతరకరమైన పోస్ట్ షేర్ చేస్తే, వెంటనే సంబంధిత వ్యక్తి గురించి జనగామ పోలీసులకు కానీ డయల్ 100కు కాల్ చేసి చెప్పాలని, సున్నితమైన ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని జనగామ సిఐ దామోదర్‌రెడ్డికి సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మున్సిపాలిటీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గదెపాక రామచంద్రం, మాజీ కౌన్సిలర్ మేడే శ్రీనివాస్, కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జమాల్‌షరీఫ్, ముస్లింపెద్దలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



తమతో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు గత వారం రోజుల క్రితం మృతిచెందడంతో ఆయనతో పదవ తరగతి కలసి చదువుకున్న స్నేహితులు శుక్రవారం కుటుంబసభ్యులను పరామర్శించారు. జనగామ మండలం పెంబర్తికి చెందిన సంకటి రాంమూర్తి అనారోగ్యంతో మృతి చెందడంతో ఉన్నత పాఠశాలలో 2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులంతా కలిసి శుక్రవారం రూ.7500లు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ పరామర్శలో ఎ.రఘునాథ్, ఎం.సంతోష్‌చారి, బి.కుమార్, బి రవి, జి.నాగరాజు, ఎ.వెంకటేష్, బి.కృష్ణ, ఎం.రవీందర్, వై.శ్రీకాంత్, ఎస్. శైలేష్, టి.కృష్ణాచారి, యు.నాగరాజు తదితరులు ఉన్నారు.

## నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్ /జనగామ



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ఈ నెల 31న శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జనగామ జిల్లా ప్రధాన జడ్జి డి.రవీంద్ర శర్మ శుక్రవారం తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి శనివారం జనగామ జిల్లా కేంద్రానికి చేరుకొని ఉదయం 09.00 గంటలకు లేడీ అడ్వకేట్స్ రూమ్, ఇ-లైబ్రరీని ప్రారంభిస్తారని, బ్యాడ్మింటన్ షటిల్ కోర్ట్ సందర్శించి, మెడికల్ క్యాంప్‌తోపాటు బ్లడ్‌డొనేషన్ కార్యక్రమాలను పరిశీలిస్తారని, అనంతరం జిల్లా జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌కు అధ్యక్షత వహిస్తారన్నారు.

## రాజ్యాధికారం వస్తేనే రిజర్వేషన్ అమలు చేస్తారా?

- మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్



నవతెలంగాణ-పర్వతగిరి

ముదిరాజులకు రాజ్యాధికారాలు వస్తేనే రిజర్వేషన్ ఫలాలు అందుతాయా ? అని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ లో శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కష్ణ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో (మెపా తెలంగాణ) ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తమమేనిఫెస్టోలో చేర్చిన రిజర్వేషన్ అంశాన్ని స్థానిక ఎన్నికలలోపే పరిష్కరించాలని, బిసి జన గణన చేపడితే ముదిరాజ్‌లకే మేలు జరుగుతుందని, ముదిరాజ్‌ల ప్రభుత్వం పక్ష పాతిగా ఉన్నారని అలాంటి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని అన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా మెపా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్ నిహారిక ముదిరాజ్‌ల పుత్రికల కర్ణవేదన(చెవులు) కుట్టు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరై ప్రతి ముదిరాజ్ బిడ్డకు పేరు చివరన ముదిరాజ్ అని నామకరణం చేయాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సింగారపు రామకష్ణ,నీరటి రాజు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల ష్ణ,మహబూబా జిల్లా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్, మహబూబాద్ నియోజకవర్గ ఇన్చార్జి సింగని మహేష్, చొప్పరి మహేందర్, నరబోయిన రమేష్, కొండా సురేష్, గౌరబోయిన మహేందర్, సింగని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నెక్కొండ

ప్రతి పౌరుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రశ్నించే హక్కులను సాధించుకోవాలని హక్కులతో పాటుగా బాధ్యత కలిగి ఉండాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హంస నరేందర్ అన్నారు. మండలంలోని మహబూబ్‌నాయక్‌తండా గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ గ్రామసభ నిర్వహించారు. ఆర్ఐ హంసనరేందర్ హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ కలలుగన్న సమ సమాజానికి నిర్మించాలని, అంటరానితనం నిర్మూలనలో భాగస్వాములు కావాలని, సమానత్వం పాటించాలని, వివక్షతకు గురి చేయరాదన్నారు. అధికారులు బాధ్యతయుధంగా పని చేయాలని, పేద ప్రజల పక్షాన నిలబడాలని సమాజాన్ని చైతన్య పరచాలనారు. అనంతరం పౌర హక్కుల ప్రతిజ్ఞ చేశారు. గ్రామసభలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంఈఓ రత్న మాల, అంబేద్కర్ యువజన సంఘ జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి, ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శి నాగార్జున, హెచ్ డబ్ల్యూ రాజేంద్రప్రసాద్, ఏఈఓ రాజీవ్ లోచన్, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్వాడి టీచర్ సైదమ్మ, సిఆర్పి దేవేందర్, మంజుల, కారోబార్ నరేష్ పాల్గొన్నారు.



## ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి





- విషజ్వరాలు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలి
- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

నవతెలంగాణ-జనగామ

వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు వ్యాప్తించకుండా ప్రజలు ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే సందర్భంగా జనగామ మున్సిపాలిటీలోని 7, 10వ వార్డులను శుక్రవారం కలెక్టర్ సందర్శించి, పరిశీలించారు. ప్రజలు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో వార్డుల్లోని పలు వీధులలో పర్యటించి, కాలనీల్లో వర్షపునీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మురుగు కాల్వలు, రోడ్లపై చెత్తను, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను ట్రాక్టర్ లతో వెంటనే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కాలనీల్లోని ఇంటి సభ్యులతో మాట్లాడారు. వారికి తగిన జాగ్రత్తలు చెప్పారు. ఇందులో భాగంగా వర్షాకాలం దృష్ట్యా దోమలు విజృంభించకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. విష జ్వరాలు, డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి, వైద్యం చేయించుకోవాలని, అందుకు సంబంధించిన రక్త నమూనా పరీక్షలు చేయించుకొని, తగినచికిత్స తీసుకోవాలన్నారు. అలాగే డెంగ్యూతో బాధపడుతున్న రోగులను పరామర్శించి, మందులను సమయానికి తగినట్లుగా వేసుకోవాలని, చేతుల పరిశుభ్రత పాటించాలని, తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలని వారికి సూచించారు. అదే విధంగా తగిన ఔషధాలు ఇవ్వాలని సంబంధిత మెడికల్ సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వార్డు అధికారి సదానందం, శానిటరీఇన్స్పెక్టర్ గోపయ్య, ఇతర సంబంధిత అధికారులు, మెడికల్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేస్తాం : అదనపు కలెక్టర్





నవతెలంగాణ-పాలకుర్తి

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పాలకుర్తిలో గల మూడవ అంగన్‌వాడి కేంద్రాన్ని, మండలంలోని దర్దేపల్లిలో గల మొదటి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఆయా కేంద్రాల అంగన్‌వాడి భవనాలు శిథిలావస్థకు చేరడంతో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 15 అంగన్వాడి కేంద్రాల భవనాలను మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 2 లక్షల చొప్పున రూ.30 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లోని పౌష్టికరమైన ఆహారంతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని, మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలను సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని జయంతి, ఎంపీడీవో రాములు, పంచాయతీరాజ్‌శాఖ పాలకుర్తి మండల ఇన్చార్జి ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు వెంకటాచారి, యుగంధర్, జయశ్రీలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డుల ప్రధానోత్సవం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



వరంగల్ రీజియన్ లోని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డుల ప్రధానోత్సవం వరంగల్ 1డిపోలో జరిగినది. నాలుగవ త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, ఇచ్చి అట్టి ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది అందరూ కష్టపడి పని చేస్తున్నారని, రాఖీ సందర్భంగా సిబ్బంది అందరూ ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా అన్ని డిపోలలో అన్ని కేటగిరీల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి బస్సులు నడిపి ప్రయాణికులు అందర్నీ సమర్థవంతంగా తరలించారని అత్యధిక ఆదాయం సాధించడంలో ముఖ్యభూమిక పోషించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా శ్రావణమాసం ఛాలెంజ్‌లో అగ్రగామిగా వరంగల్ రీజియన్ నిలవాలని వరంగల్ రీజియన్ ఉద్యోగులు అదే స్ఫూర్తితో ముందు కూడా పని చేయాలని కోరారు. ఆర్టీసీకి ప్రయాణికులే ఆస్తి అని వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ముఖ్యంగా మహా లక్ష్మి పథకం అమలు తర్వాత బస్సులలో ప్రయాణించే మహాలక్ష్ములు అందరితో కూడా మర్యాదపూర్వకంగా ప్రవర్తించి ఆర్టీసీ సంస్థకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అవార్డు ప్రధానఉత్సవంలో ఉద్యోగులకు క్యాష్ అవార్డు లు, ప్రశంస పత్రాలు శాలువాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ ఎం ,కేశరాజు భాను కిరణ్ , డిప్యూటీ ఆర్ ఎం.మాధవరావు,భావురావు, కరీంనగర్ జోన్, రవీందర్, విజిలెన్స్ సిఐ రవీందర్ ఏఓ, పిఓ, 9 డిపోల డిపో మేనేజర్లు సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎస్ అంతమయ్యే వరకు విశ్రమించేది లేదు

### టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్ ఖాజా షరీఫ్




నవతెలంగాణ-జనగామ

ఉద్యోగులపాలిట శాపంలా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అంతమయ్యేవరకు విశ్రమించకుండా ,పోరాటాల ద్వారా సాధించుకోవాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జెఎసి) జిల్లా చైర్మెన్ ఖాజా షరీఫ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని టిఎన్జిఓ భవన్ లో జరిగిన తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ భాగస్వామ్య సంఘాల సమావేశం టిజిఓ ప్రధాన కార్యదర్శి నీలం కొర్నేలియస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఖాజా షరీఫ్ పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవనాన్ని కొనసాగించాలంటే ,ఆర్థిక భరోసా కల్పించాలంటే పాత పెన్షన్ విధానం కొనసాగడమే మార్గమని అన్నారు. కార్పొరేట్ శక్తుల బాగుకోసమే సిపిఎస్ విధానాన్ని తీసుకువచ్చారని మండిపడ్డారు. ఇది ఎంతమాత్రం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదన్నారు. సిపిఎస్ రద్దే ఏకైక లక్ష్యంగా పోరాటానికి పిలుపునిచ్చామని తెలిపారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని జిల్లాలో నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. సిపిఎస్ రద్దు ఓ పి ఎస్ ముద్దు అనే నినాదంతో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలో ఉన్న అన్ని ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాలతోపాటు పెన్షనర్ సంఘాలు పాల్గొంటున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అధ్యక్షులు కొర్నేలియస్ మాట్లాడుతూ సిపిఎస్‌రద్దు కోసం ఒకవైపు పోరాటం చేస్తుంటే ,కేంద్ర ప్రభుత్వం మరింత మెరుగైన విధానం అంటూయుపిఎస్ ను తీసుకురావడం మోసం చే యడమేనని అభిప్రాయపడ్డారు.ఓపిఎస్ మాత్రమే మాకు అంగీకారమని అన్నారు.

ఈ సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, శ్రీనివాస రావు, డిటిఎఫ్ ఉపాధ్యక్షులు చొక్కయ్య, పెన్షనర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య సిపిఎస్ టీఎన్జీవోస్ నాయకులు భాస్కర్, సంపత్, రామ నర్సయ్య, ఉప్పలయ్య , నాగార్జున , ప్రభాకర్ , రొండ్ల శ్రీనివాస్ రెడ్డి , శంకర్ , విష్ణబాబు , శ్రీధర్, యాకూబ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీకి చేరిన మూడు లారీల యూరియా



నవతెలంగాణ-బచ్చన్నపేట

నవతెలంగాణ ఎఫెక్ట్

రైతులకు అండదండలుగా ఉండాల్సిన ప్రభుత్వాలు రైతులకు అందించాల్సిన ఎరువులను సకాలంలో అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు అన్న కథనం నవతెలంగాణలో రావడంతో వెంటనే స్పందించిన సొసైటీ చైర్మన్, సీఈవో బాల స్వామి మాట్లాడుతూ శుక్రవారం సొసైటీకి మూడు లారీల యూరియా వచ్చిందని ఈరోజు నుండి రైతులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. నిత్యం సొసైటీ రైతులకు అందుబాటులో ఉంటుందని సొసైటీ సేవలను రైతులు వినియోగించుకోవాల్సిందిగా వారు కోరారు. అలాగే ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రైతులకు యూరియా అందిస్తున్నామని యూరియా మీద ఎటువంటి అధిక ధర తీసుకోట్లేదని తెలిపారు.

## వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి అబ్దుల్లా బాబా దర్గా

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ దర్గాను రాష్ట్ర వక్ఫ్ బోర్డు టాస్క్ ఫోర్స్ బందం స్వాధీన పరుచుకున్నట్లు జిల్లా మైనార్టీ శాఖ అధికారి రవీందర్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని అబ్దుల్లా బాబా దర్గాలో అనధికారిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎక్ఫ్ బోర్డు చైర్మెన్ కు ఫిర్యాదు అందడం, జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ స్పందించడంతో హైదరాబాద్ లోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు బృందం జిల్లాకు చేరుకొని జనగామ జిల్లాలోని అబ్దుల్లా బాబా దర్గా పై వచ్చిన ఫిర్యాదులను విచారణ జరిపి వక్ఫ్‌ఆస్తి అయిన దర్గాను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ముహమ్మద్ ఆసిఫ్ ఖాన్, టాస్క్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సయ్యద్ ఇబ్రహీం, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహ్మద్ రియాజ్‌పాషా, టాస్క్ ఫోర్స్ టీమ్ సభ్యులు షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ వక్ఫ్ బోర్డు సర్వేయర్ మహమ్మద్ వాజిద్, జిల్లా మైనార్టీ సంక్షేమ సభ్యుడు మసీ ఉర్ రెహమాన్ పాల్గొన్నారు.

## ఎంపీ ఫ్లెక్సీలను చించడం సిగ్గుచేటు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



భువనగిరి లోక్సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఆయన ఫ్లెక్సీలను చింపడం సిగ్గుచేటు అని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అజయ్ గౌడ్ అన్నారు. శుక్రవారం జనగామలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బిసిసెల్ జనగామ జిల్లా అధ్యక్షులు లోక్కుంట్ల ప్రవీణ్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ అంటే పది మందికి సహాయపడేలా ఉండాలి కానీ ఇతరులని నాశనం చేసేలా కాదన్నారు. చాతనైతే ప్రజల ప్రేమ, ఆదరాభిమానాలు పొందేలా పని చేసి పార్టీ ప్రతిష్టని పెంచాలి కానీ ఇలా పార్టీని నాశనం చేసేలా ఉండకూడదని కోరుతున్నామన్నారు. ఇలా చేయడం పార్టీ విధి విధానాలు కాదని తెలుపుతున్నాం అన్నారు. ఇంకొకసారి ఇదే విధంగా ఎంపీఫ్లెక్స్ లని చింపే ప్రయత్నం చేస్తే ఉరుకోమని హెచ్చరిస్తున్నామన్నారు. ఇలా దొంగ తనంగా రాత్రి పూట ఫ్లెక్స్ లు చింపడం మీ నాయకుడు మీకు నేర్పిన పద్ధతి అయితే అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం అన్నారు. కొన్ని రోజుల క్రితం హనుమండ్ల ఝాన్సీ రెడ్డి పుట్టిన రోజు వేడుకలకు కూడా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌లని కూడా ఇదే విధంగా చింపి మీ నీచ బుద్ధిని చూపించుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని, విధి విధానాలని కాపాడడం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాధ్యత అన్నారు. తాము కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా మా బాధ్యత కూడా అని తెలుపుతున్నాం అన్నారు. ఇంతటి నీచ స్థాయికి దిగజారిన వారికి తగిన శాస్తి జరుగుతుందన్నారు.

## ఓటర్ జాబితా నమోదు పరిశీలన



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తదుపరి గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ జాబితా నమోదు పూర్తయిందని డీపీఓ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ప్రత్యేకంగా ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల గత ఓటరు లిస్టు మాత్రమే మాపింగ్ పద్ధతిని పూర్తి చేస్తున్నామన్నారు. ఇందులో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా వచ్చే నెల 6న గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట నోటీస్ ఇస్తామని సెప్టెంబర్ 12వరకు చేర్పులు మార్పులు చేసుకోవచ్చన్నారు. భవిష్యత్తులో ఇంటి పన్నులు సైతం ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నామని, ఇంటి పన్నులు చెల్లిస్తే ఆన్ లైన్ లో నమోదు చేయడం వల్ల పారదర్శకంగా ఉండే వీలుంటుందని అన్నారు. అలాగే గ్రామంలో ట్రేడింగ్ వ్యాపారం కల్గిన ప్రతీ ఒక్కరూ పన్ను చెల్లింపు చేసే విధంగా, గతంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ ఆర్ఐ, పంచాయితీ కార్యదర్శి తో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఈఓ సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి జేసుమణి, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హుండీ ఆదాయం రూ.7.50లక్షలు

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండి ఆదాయం 7లక్షల52వేల50 పైసలు వచ్చినట్లు ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకుడు అనిల్ కుమార్ పర్యవేక్షణలో మే 30వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఆలయం ప్రాంగణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన ఎనిమిది హుండీల ద్వారా యాత్రికులు సమర్పించిన కానుకలను లెక్కించగా 7లక్షల 52వేల50 పైసల ఆదాయం సమకూరినట్లు సత్యనారాయణ వెల్లడించాడు. మిశ్రమ వెండి మిశ్రమ బంగారు ఆభరణాలు ఏమీ రాలేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు కైంకర్యం రాఘవాచారి రాజశేఖర్ శర్మ పవన్ కుమారాచార్యులు, ఈశ్వర్ చంద్ శర్మలు పాల్గొన్నారు.

## లేఅవుట్ నిబంధనలు పాటించాలి

### మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్

నవతెలంగాణ-తొర్రూరు

లేఅవుట్ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ అన్నారు. శుక్రవారం రోజున పలు వార్డులలో తిరుగుతూ సెట్ బ్యాక్ అయిన నిర్మాణాలు పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లేఅవుట్ నిబంధనలు పాటించాలని, ఎవరైతే లేఅవుట్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతారో మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఎవరైతే ఆక్రమించి కడుతారో అటువంటి వారికి నోటీసు ఇవ్వకుండానే కూల్చివేయడం జరుగుతుందన్నారు. ఎఫ్‌టీఎల్ నుండి 100 మీటర్లు, బఫర్ జోన్ నుండి 100 మీటర్ల వరకు ఎటువంటి ఇంటి నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఓపెన్ ప్లాట్స్ కు సంబంధించిన యజమానులు తమ ప్లాట్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఓపెన్ ప్లాట్స్ యజమానులు తమ కాలి ప్లాట్లలో నీరు నిలువ ఉండి చెట్లు పెరిగి, దోమలు, ఈగలకు మూలంగా మారాయని కావున ప్రజలకు ఇరుగు పొరుగు వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున మీ యొక్క ప్లాట్ ను చదును చేసుకొని చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు. లేనియెడల 2019 మున్సిపల్ చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లేఅవుట్ లేకుండా నిర్మాణం చేపడితే అట్టివారికి పర్మిషన్ కూడా రద్దు చేస్తామన్నారు. ఆన్‌లైన్ పర్మిషన్ తీసుకొని ఇల్లు నిర్మించుకునేవారు. ఐదు ఫీట్ల సెట్ బ్యాక్ తో నిర్మించుకోవాలన్నారు. లేనిచో మున్సిపాలిటీ సిబ్బందిచే అట్టి నిర్మాణాన్ని కూల్చివేయడం జరుగుతుందన్నారు. రెండో వార్డులో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటిని అప్పటికప్పుడు వారు ఎత్తిన దర్వాజాను తీసుకొని మున్సిపల్ కార్యాలయంలో వేయమని సిబ్బందిని ఆదేశించామన్నారు. లేఅవుట్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, మున్సిపాలిటీ కార్యాలయంలో లేఅవుట్‌కు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, లేఅవుట్‌లో అనుమతి కొరకు టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ సెల్ నెంబర్ 7032796623 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఎవరివైనా శిథిలావస్థలో ఉన్న ఇండ్లను మున్సిపాలిటీకి సమాచారం అందించినట్లయితే అట్టి ఇండ్లను మున్సిపాలిటీ కూల్చి వేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డ్ ఆఫీసర్ కిరణ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

### సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్


నవతెలంగాణ-కేసముద్రం రూరల్:



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మం డల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రాల్లోని సీపీఐ కార్యాలయం (ధర్మన్న భవన్) లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి రాగానే అధిక ధరలను నియంత్రిస్తామని చెప్పిన బిజెపి సర్కార్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ధరలను విపరీతంగా పెంచిందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వలన సామాన్య ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపడం సరైంది కాదన్నారు. తక్షణమే నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసముద్రం మండల కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రోడ్లన్నీ గుంతలుగా మారి వర్షం వచ్చినప్పుడు వాటిలో నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈప్రభుత్వమైనా దృష్టి సారించి రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. పునఃప్రారంభించిన బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్ అభివృద్ధికై ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మండలంలోని వివిధ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న మహబూబాబాద్ కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాసు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాలు ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-తొర్రూరు



విష జ్వరాలు ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ శాంతి కుమార్‌లు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా 6వ వార్డ్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతిరోజు మీఇంట్లో వెళ్లే తడి పొడి చెత్తను వేరుచేసి విజిల్ వేస్తూ వచ్చే మా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ఇంటి చుట్టుపక్కల వర్షపు నీరు, పిచ్చి మొక్కలు ఉండకుండా చూడాలన్నారు. ఫ్రైడే డ్రై డే సందర్భంగా వార్డులో అవగాహన చేయుటకు ప్రజల వద్దకు వచ్చే వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్పీలకు, ఆశావర్కర్లకు సహకరించలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, జ్వరం వచ్చినట్టయితే అశ్రద్ధ చేయకుండా హాస్పిటల్ కి వెళ్లి టెస్టులు చేయించుకోవాలని సూచించారు. ప్రతి వార్డ్‌కు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డ్ ఆఫీసర్ పట్టాభి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవేందర్, ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా తల్లాడ వెంకట రామారావు ఎన్నిక

నవతెలంగాణ -మరిపెడ



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయి పాలెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తల్లాడ వెంకట రామారావును ఆర్యవైశ్య సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మహబూబాబాద్‌లో ఆర్యవైశ్య సంఘం మహాసభ స్థానిక ఆర్యవైశ్య భవనంలో జరిగింది. జిల్లాలోని 16 మండలాలకు చెందిన మండల అధ్యక్షులు ఈఎన్నికల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మహాసభ కార్యదర్శి ఎన్నికల కన్వీనర్, వగేటి అశోక్ కుమార్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ల నరసింహారావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అందరి అభిప్రాయం మేరకు తల్లాడ వెంకటరామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల అధికారి ఊరే లక్ష్మణ్, ఎన్నికల పరిశీలకులు శిరూప అనిల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల నాగేశ్వరరావు, మరి పెడ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పి.గోవర్ధన్, కార్యదర్శి శ్రీను, సంఘం సభ్యులు కందిబండ ప్రసాద్, తల్లాడ లక్ష్మికాంత్, కాంతారావు, వేణు, చోడవరపు హరికిషన్, తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం.. మందులు పంపిణీ..

నవతెలంగాణ-పెద్దవంగర:



ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవు తాపురం పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, డాక్టర్ నిఖత్‌లు అన్నారు. జన వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, లక్ష్మీ నరసింహ హాస్పిటల్ హనుమకొండ వారి సహకారంతో శుక్రవారం గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ నిఖత్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన వికాస కోఆర్డినేటర్ రమ, శైలజ శోభారాణి, సులోచన దేవి, కారోబార్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..

నవతెలంగాణ-మరిపెడ



మునుపెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులు పేదలకు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుండెపూడి గ్రామంలో పేదలకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ప్రజలు ఎమ్మెల్యే ఇంటి ముందట పాడిగాపులు కాసే వారన్నారు. రేవంతన్న ప్రభుత్వం, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రజలవద్దకు పాలన "ప్రజా పాలన" అనేవిధంగా కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ పెద్దలు గడ్డం దామోదర్‌రెడ్డి, సూరబోయిన ఉప్పలయ్య, రేఖశ్రీనివాస్, పెద్దపులి శ్రీను, పులుసు మల్లేష్ , కళింగరెడ్డి, రమేష్, గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రేఖ, ప్రవీణ్ కుమార్, రేఖనరేష్, సాగాల యాకేష్, బోడపట్ల యాకస్వామి, భాదవత్ నరేష్, సాగాల ఇమ్మానేలు, బోడపట్ల అశోక్, సూరబోయిన వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



### కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

నవతెలంగాణ-గూడూరు

సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డు తిరిగి రోగులతో మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. రిజిష్టర్లు, మందుల స్టాకు వివరాలను పరిశీలించారు. విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రభలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తదుపరి వైద్య సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు బాలికలు, బాలుర వసతి గృహాలను, జడ్పీహెచ్ఎస్ఎస్ బాలుర హైస్కూల్‌ను తనిఖీ చేశారు పిల్లలతో స్వయంగా మాట్లాడారు. ఆహారం వసతులు తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు, వసతి గృహంలో స్టడీ రూమ్, డైనింగ్ హాల్, వంట గదిని మరుగుదొడ్లు, స్వయంగా పరిశీలించారు పిల్లలకు అనారోగ్య సమస్యలు రాకుండా తీసుకుంటున్న చర్యలు, ఫీవర్ సర్వే, షెడ్యూలు ప్రకారం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు, వసతిగృహంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు, విద్యార్థిని, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ స్రవంతి, తహసిల్దార్ కోమల, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ, సంబంధిత ప్రధానోపాధ్యాయులు వార్డెన్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్



సీజనల్ వ్యాధుల నియంత్రణపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, మెడికల్ ఆఫీసర్లు, వార్డెన్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలలో విద్యార్థిని విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు చెపట్టాన్నారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి పథకం అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో విషజ్వరాలు ఎక్కువగా నమోదయ్యే గ్రామాలు, పట్టణాల్లో, వార్డుల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనార్టీ, అన్ని సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం వారం రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ పరిధి, పట్టణ పరిధిలలో ప్రతిరోజు ఉదయం శానిటేషన్, ఫాగింగ్, పరిశుభ్రత, విష జ్వరాల నియంత్రణపై తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాలకు కేటాయించిన ప్లాంటేషన్ లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం అమలుకు సంబంధిత అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్, డిపిఓ హరిప్రసాద్, జిల్లా వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, సిపిఓ సుబ్బారావు, ఏడీఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, డీడీ గ్రౌండ్ వాటర్ సురేష్, డీఏఓ విజయనిర్మల, డిహెచ్ఎస్ఓ మరియన్న, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సైదులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు..

## పెరుమాళ్ల పిచ్చమ్మకు విప్లవ జోహార్లు



### సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య. పిచ్చమ్మ భౌతికగాయానికి నివాళులు

నవతెలంగాణ- తొర్రూర్‌రూరల్

కామ్రేడ్ పెరుమాళ్ళ పిచ్చమ్మ భౌతిక కాయనికి సీపీఐ(ఎం) పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య ఎర్రజెండా కప్పి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. జీవితకాలం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో బ్రతికిన అమర జీవీ కామ్రేడ్ పెరుమాళ్ళ జగన్నాధం జీవిత భాగస్వామి కామ్రేడ్ పెరుమాళ్ళ పిచ్చమ్మ (83)అనారోగ్యంతో గురువారం మరణించారు. వారి భర్త సీపీఐ(ఎం) నాయకులు కామ్రేడ్ పెరుమాళ్ళ జగన్నాధం ఆనాడు మానుకోట ప్రాంతంలో భూస్వామ్య గుండాలు సాగించిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన పోరాడిన కమ్యూనిస్ట్ యోధుడు కామ్రేడ్ జగ న్నాధం. వీరు సాగించిన పోరాటాలను జీర్ణించుకోని భూస్వాములు అతి వాద గుండాలతో మిలాఖత్ అయి కామ్రేడ్ జగన్నాధంను 1981 కాంగ్రెస్, నక్సలైట్ గుండాలు అతి కిరాతకంగా హత్య చేయడం జరిగింది. జగన్నాధంకు అండగా నిలిచినా కామ్రేడ్ పిచ్చమ్మ నేటికీ ఎర్రజెండా ముద్దు బిడ్డగా నిలిచారు. వీరికి ముగ్గురు కొడుకులు ఒక కుమార్తె వున్నారు. ఇందులో వీరి రెండవ కుమారుడు కామ్రేడ్ పెరుమాళ్ళ తిలక్ బాబు వారి ఆశయ సాధనలో సీపీఐ(ఎం) నెల్లికుదురు మండల కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాధుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సూర్నపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, తొర్రూర్ మండల కార్యదర్శి ఎండి యాకూబ్, గుద్దేటి సాయమల్లు ఉమ్మగాని యాకయ్య, కొత్త వెంకటరెడ్డి, మార్క సుధాకర్, సోమయ్య వారి కుటుంబ సభ్యులు పెరమండ్ల మధుబాబు, తిలక్ బాబు, లెనిన్ బాబు, పుష్పలత, సరోజన తదితరులు పాల్గొన్నారు.

## మానుకోటలో.. ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీలు..

నవతెలంగాణ- మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్ అధికార బృందం శుక్రవారం తనిఖీలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాలో మూడు బృందాలుగా ఏర్పడి ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటల్లో, సీజనల్ వ్యాధులు, కీటక జనత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, సంబంధిత కేసులు ఆస్ప త్రులలో నమోదు జరిగితే అట్టి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో తప్పని సరిగా సమాచారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. రక్త పరీక్షలు, ఆస్పత్రులలో పరీక్షలకు సంబంధించిన ఫీజు వివరాలను, స్థానిక భాషలో ఆస్పత్రి ఆవరణలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రులకు వస్తున్న డాక్టర్ల కన్సల్టేషన్ వివరాలను అందరికీ కనపడే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ లేని వారికి నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం, చట్టరీత్యా చర్య తీసుకోబడుతుందని, హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలోని 14 ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేయడం జరిగిందని, ఇందులో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలను ఉల్లంగించిన వాటిని గుర్తించి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్, డిప్యూటీ డిఎంహెచ్‌వో పమీల , ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె.ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవీ రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్స్ రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ , అరుణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టం చేయాలి



### తొమ్మిది రకాల సరుకులను ఉచితంగా ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్:

కేసముద్రం మండలం తాళ్లపూసలపెల్లి గ్రామంలో మేస్త్రీల కూలీల సదస్సు జరిగింది. ఈసదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనచట్టం తీసుకురావాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 9 రకాల సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సు వ్యవసాయకారి సంఘం జిల్లా నాయకులు గోడిశాల వెంకన్న అధ్యక్షతన జరిగింది. వ్యవసాయంలో నూతనంగా వచ్చిన మార్పుల వల్ల కూలీలకు కనీసం 60 రోజులకు మించి పనులు దొరుకుతలేవని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని తెలిపారు. కనీసం వేతనాలు రాక ధరలు పెరగడంతో పూటగడవని పరిస్థితులను కూలీలు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయ కార్మికులు ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు కోసం ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని తెలిపారు. అనంతరం పదిమంది మేస్త్రీలను పూలమాలవేసి సత్కరించి వారి సేవలను కొనియాడారు. అనంతరం గ్రామ గుత్తా మేస్త్రీల కమిటీని వేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ గ్రామ నాయకులు మాద శ్రీనివాస్ గౌడ్, జ్యోతి, మేకల మురళి, తులసి, మొగ్గ వెంకన్న, ఆరె కవిత, నాగుల కాంతమ్మ కుంట సంపత్, ప్రవీణ్, శారద, రమ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారం..

### టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్

నవతెలంగాణ-మహబూబాబాద్

సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెన్షన్ విధానం ప్రస్తుత సీపీఎస్ విధానానికి మసిపూసి మారేడుకాయ చేయడమేనని, దానిని అంగీకరించేది లేదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ స్పష్టం చేశారు. టీఎస్ యూటీఎఫ్ కురవి మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కురవి మండలంలోని మొగిలిచర్ల, రాజోలు, నల్లెల్ల, మోదుగులగూడెం తదితర పాఠశాలలో పాల్గొని ఈసందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం పైగా ఐచ్ఛికమని పేర్కొనడంలోనే అసలు మోసం ఉందన్నారు. ఇవేవీ కాకుండా ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీస్‌ను బట్టి 50 శాతం పెన్షన్‌ను ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన ఏకీకృత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా సీపీఎస్‌ను రద్దు చేసి ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, బి.బాబు, ఆర్.సురేష్, రాజు, సలీం, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన మాజీ ఎంపీపీ స్కార్పియో వాహనం

### తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-గార్ల:



మండల పరిధి లోని శేరిపురం గ్రామ సమీపంలో రహదారి పై వెళ్తున్న మాజీ ఎంపీపీ మూడ్ శివాజీ చౌహాన్ స్కార్పియో వాహనం అదుపు తప్పి సమీపం లోని పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పినిరెడ్డిగూడెం గ్రామం నుండి సీతంపేట వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం శేరిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మహిళను తప్పించబోయి అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. వాహనంలో ప్రయాణిస్తున్న డ్రైవర్ తో సహా నలుగురు వ్యక్తులు ఉండగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వరి పంట పొలాలలో పడిన స్కార్పియో వాహనాన్ని జేసీబీల సహాయంతో బయటకు తీశారు. ఈఘటనలో ఎవరికి తీవ్ర గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చు కున్నారు.

## బీఎస్పీ నాయకునిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలి

### బీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్పీకి వినతి

నవతెలంగాణ-మహబూబాబాద్



బీఎస్పీ నాయకునిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలనీ బీఎస్పీ జిల్లా యూనిట్ ఆధ్వర్యం లో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రెండవ సారి ప్రభుత్వంలో డోర్నకల్ మండలం, చిలుకోడు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావంతుడు, బీఎస్పీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి గురించి బీఎస్పీ పార్టీ నాయకునిగా పదే పదే ప్రశ్నించడం తో ఎక్కడ తన అక్రమాలు, అవినీతి ప్రజల ముందు బయట పడి దోషి అవుతాననేమోనని నాటి అధికార పార్టీ పెద్దల సహకారంతో ప్రజా సమస్యల కోసం కొట్లాడిన చిన్న కేసులను దష్టి లో పెట్టుకొని మాజీ సర్పంచ్ అయిన రాయల వేంకటేశ్వర రావు ప్రోద్భలం తో రౌడీ షీట్ ఓపెన్ చేయించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు, ప్రజా ఉద్యమాలు చేస్తున్న ఉన్నత విద్యావంతునికి ఇచ్చే బహుమానం ఇదేనా అని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాస్తవాలని పరిశీలించి జెన్యూన్ వుంటే రౌడీ షీట్ తీసేస్తామని అన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ ఎల్.విజయ్ కాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐతాం ఉపేందర్, జి.శ్రీను తదతరులు పాల్గొన్నారు. విష జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

## మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

### కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం రోడ్డు వైపు వెళ్ళే డ్రైనేజీ కాలువ సరియైన ప్లానింగ్ లేకుండా నిర్మించడం వల్ల ఆ ఏరియాలో ఉన్న గురుకుల పాఠశాల, మేయిన్ రోడ్డు పైన ఉన్న ఇండ్ల నుండి వచ్చిన మురుగునీరు అంతా 2వ వార్డ్ కు చెందిన నాగేశ్వరకాలనీలో చేరి పెద్ద మురుగునీటి కుంటగా ఏర్పడుతుందని కాలనీవాసులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మురుగునీరు నిల్వ ఉండడం వల్ల అక్కడి ఇండ్ల లోకి మురుగునీరు చేరి, భూమి లోకి ఇంకి, బోర్లలో నీరు కలుషితమై తాగునీరు తీవ్ర దుర్వాసన వస్తుందని, నీటి కాలుష్యం వలన పలు విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, నిన్నటి వర్షానికి మురుగునీరు అంతా రోడ్డు పైకి చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడిందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కాలనీని సందర్శించి మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు.అతి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో నాగేశ్వర కాలనీ వాసులు పల్లె కుమార్, చిట్టి అశోక్ రెడ్డి, నాగెళ్ళి భిక్షం, దోరపల్లి రాజేష్, ధర్మారపు వేణు, లునావత్ మంగిలాల్, నరేంధర్, వేణు చారి, నాగెళ్ళి వెంకటమ్మ ,గడ్డం రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతులు అధైర్య పడొద్దు

### మండల వ్యవసాయాధికారి స్వామి

నవతెలంగాణ-పెద్దవంగర



రుణమాఫీ కాని రైతులు అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారి గుగులోత్ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని రుణమాఫీ కాని రైతుల ఇంటికి శుక్రవారం వెళ్లారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వివరాలు సేకరించి, ఆయా రైతులతో ఏవో సెల్ఫీ దిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ వర్తించని రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు భరోసా, పంట రుణమాఫీ యాప్ లో రైతు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసినా, దరఖాస్తు చేసుకున్న రైతుల ఇంటికి వ్యవసాయ అధికారులే వెళ్లి వారి బ్యాంకు రుణం తీసుకున్న ఖాతాలు, ఆధార్ కార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ, రుణాలు ఉన్న భార్యాభర్తలనే కాకుండా 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యులందరి ఫొటోలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కుటుంబ యజమాని తన రుణ ఖాతా, బ్యాంకు వివరాలతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను యాప్ లో నమోదు చేస్తున్నామని తెలిపారు. రైతులు అధైర్య పడద్దని రుణమాఫీ కాని రైతుల ఇంటికే వచ్చి వివరాలను సేకరిస్తామన్నారు.